

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## నెల్లూరు జిల్లా కలెక్టర్ పనితీరు అభినందనీయం

- హోంమంత్రి అనిత





**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబర్ 30, ప్రభాతవార్త** మాంథ తుఫాన్, నేపథ్యంలో ముందస్తు చర్యలతో నెల్లూరు జిల్లా సంగం బ్యారేజీకి ముప్పు తప్పిందని సంగం బ్యారేజీలో కొట్టుకొచ్చిన భారీ బోటును శ్రమించి ఒడ్డుకు చేర్చారని బ్యారేజీకి ప్రమాదం సంభవించకుండా నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్స్ శుక్ల అధికారులు వెంటనే స్పందించి సంగం బ్యారేజీ బోటు ప్రమాదానికి గురికాకుండా చర్యలు తీసుకున్నారని యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవడంలో నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పనితీరు అభినందనీయం అని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, అక్టోబరు 30, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి గురువారం సాయంత్రానికి 69857 క్యూసెక్కుల వంతునవరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 70.986టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 200, ఎస్ఎఫ్‌సికి 50, పెన్నా డెల్టాకు 0, కండలేరు వరద కాలువకు 0 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం99.621మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# సంగం బ్యారేజ్‌కు తప్పిన ముప్పు

- చాకచక్యంగా మూడో పడవను ఒడ్డుకు చేర్చిన యంత్రాంగం - జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**సంగం, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** మొంతా తుఫాను నేపథ్యంలో కురిసిన భారీ వర్షాల కారణంగా కొట్టుకువచ్చి సంగం బ్యారేజ్ సమీపానికి చేరిన పడవను గురువారం ఉదయం చాకచక్యంగా ఒడ్డుకు చేర్చినట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మొత్తం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా దగ్గర ఉండి నిరంతరం అమూల్యమైన సలహాలు, సూచనలు ఇస్తూ పర్యవేక్షించారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, జిల్లా ఎస్పీ అజిత వేజెండ్లతో కలిసి పరిస్థితిని సమీక్షించారు. హుటాహుటిన అధికారులను అప్రమత్తం చేసి, ప్రతి బృందానికి స్పష్టమైన బాధ్యతలు అప్పగించారు. మొత్తం 30 మంది చొప్పున ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు, 100 మంది పోలీసు సిబ్బంది, కృష్ణపట్నం పోర్టు గస్తీ బృందం, ఫైర్, ఇరిగేషన్ అధికారులు సమన్వయంగా కృషి చేయడంతో పడవను సురక్షితంగా ఒడ్డుకు చేర్చగలిగామని కలెక్టర్ వివరించారు. ప్రవాహ ధాటికి తీసుకురాలేకపోయిన మూడవ పడవను గురువారం ఉదయం చాకచక్యంగా ఒడ్డుకు చేర్చారు. లక్ష క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతున్న సమయంలో 30 టన్నుల పడవ ప్రాజెక్టుకు తగిలితే సంగం బ్యారేజ్ ఉనికే ప్రశ్నార్థకమయ్యేదని కలెక్టర్ అన్నారు. అంతేకాకుండా 85 గేట్లతో 3,85,000 ఎకరా లు ఆయకట్టు భూములను సస్యశ్యామలం చేస్తున్న సంగం బ్యారేజ్ కు ప్రమాదం జరిగి ఉంటే నీరు వృధాగా పోయి రాబోయే సీజన్ లో రైతులు నష్టపోయేవారన్నారు. అలాగే పొదలకూరు, సంగం గ్రామాలకు మధ్య రాకపోకలు స్థంభించేవని అన్నారు. జిల్లా కలెక్టర్ సమయస్ఫూర్తి, సమర్థ నిర్ణయాలతో ఎటువంటి ప్రమాదం లేకుండా సంగం బ్యారేజ్‌ను, తద్వారా ప్రజలను కాపాడారని సోమశిల ప్రాజెక్టు చైర్మన్ కేశవ చౌదరి జిల్లా ప్రజలందరి తరఫున జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లకు అభినందనలు తెలియజేశారు. బుధవారం (29వ తేది) భారీ వర్షాల తాకిడికి పై నుండి కొట్టుకువచ్చిన మూడు పడవలలో రెండింటిని అదే రోజు ఒడ్డుకు చేర్చిన విషయం తెలిసిందే. మిగిలిన మూడవ పడవ బ్యారేజికి ఎగువన 400 మీటర్ల దూరంలో పాత ఆనకట్ట క్రెస్ట్ అడ్డుకోవడంతో నిలిచిపోయిన విషయం పాఠకులకు తెలిసిందే.

## తుఫాన్ భాదితులకు రేషన్ పంపిణీ

- భాదితులు ఆందోళన చెందవద్దు - ప్రభుత్వం అండగా ఉంటుంది

- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబర్ 30, ప్రభాతవార్త** ఇటీవలి మొంతా తుఫాన్ ప్రభావిత కుటుంబాల పునరావాసం సహాయక చర్యల కు జిల్లా పరిపాలన విస్తృత స్థాయిలో చర్యలు చేపట్టింది. భాదితులు ఆందోళన చెందవద్దు, ప్రభుత్వం అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. గురువారం ఉదయం తుఫాన్ అనంతరం తీసుకుంటున్న చర్యలు, వాటి పురోగతిపై ఆర్డీవోలు, తహశీల్దార్లు, జిల్లా అధికారులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తుఫాన్ అనంతరం తీసుకుంటున్న చర్యలను వేగవంతం చేయాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో మొత్తం 3,635 కుటుంబాలు సురక్షితంగా వసతి పొందాయి. వీటికి అదనంగా 13,512 మత్స్యకార కుటుంబాలు, 106 చేనేత కుటుంబాలు తుఫాన్ ప్రభావితులుగా ఉన్నారు. చేనేత కుటుంబాలకు సంబంధించి పక్కాగా సర్వే చేయాలన్నారు. వీరందరికి ప్రభుత్వ ఆదేశాల మేరకు నిత్యావసర సరుకులను ఈ గురువారం నుండి సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. ఈ పంపిణీ కార్యక్రమాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులను తప్పకుండా భాగస్వామ్యం చేయాలన్నారు.

**ప్రభావిత కుటుంబాలకు అవసరమైన నిత్యావసర సరుకుల పంపిణీ వివరాలు:**

పునరావాస కేంద్రాల్లో ఉన్న వారికి 25 కిలోల బియ్యం..తో పాటు ప్రతి కుటుంబానికి అదనంగా 1 కిలో బంగాళాదుంపలు 1 కిలో పామాయిల్, 1 కిలో కందిపప్పు, 1 కిలో ఉల్లిపాయలు, 1 కిలో చక్కెర పంపిణీ చేయడం జరుగుతుంది మత్స్యకారులు, చేనేత కుటుంబాలకు – 50 కిలోల బియ్యం చేయాలన్నారు ఈ సహాయక చర్యలు అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి పారదర్శకంగా సహాయం అందేలా కృషిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేసి వెంకటేశ్వర్లు, డిఆర్వో విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కార్యాలయం వద్ద హైడ్రామా

- ఉద్యమాల నేపధ్యంలో ఆర్థికంగా చితికిపోయానంటూ మార్నేని రామకృష్ణ పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నం
- పురుగుల మందు తాగిన విషయం మీడియాకు స్వయంగా ఫోన్ చేసి సమాచారం ఇచ్చిన రామకృష్ణ
- వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్, మీడియా ప్రతినిధులు



**వింజమూరు, అక్టోబర్ 30, ప్రభాతవార్త** వింజమూరు పట్టణంలోని స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం వద్ద హైడ్రామా చోటు చేసుకుంది. ఉద్యమాల నేపథ్యంలో ఆర్థికంగా చితికిపోయానంటూ వరికుంటపాడు మండలానికి చెందిన మార్నేని రామకృష్ణ పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రామకృష్ణ స్వయంగా మీడియా ప్రతినిధులకు ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సమాచారం ఇచ్చాడు. అక్కడికి చేరుకున్న మీడియా ప్రతినిధులు ఎమ్మెల్యేకి సమాచారం ఇవ్వగా ఎమ్మెల్యే స్వయంగా తన మనుషులకు చెప్పి హాస్పిటల్‌లో చేర్చమన్నాడు. అంతే కాకుండా పోలీసులకు సమాచారం ఇవ్వటంతో కలిగిరి ఇన్‌స్పెక్టర్ ఉమా శంకర్ హుటాహుటీన అక్కడికి చేరుకుని తన వాహనంలోనే వైద్యశాలలో చేర్పించారు. డాక్టర్లు ప్రథమ చికిత్స చేసి మెరుగైన చికిత్స కోసం ఆత్మకూరు పంపినట్లు తెలిపారు. రామకృష్ణ వద్ద ఉన్న ఒక వినతిపత్రంలో తను కౌలు రైతునని గత రెండు సంవత్సరాలుగా పంటలు పండక పండిన పంటలు గిట్టుబాటు లేక అప్పులు పాలయ్యానని అప్పులు తీర్చలేక అప్పు ఇచ్చిన వారికి సమాధానం చెప్పలేక తీవ్ర మానసిక శోభ అనుభవిస్తున్నానని వినతిపత్రంలో రాసుకున్నాడు. ఉదయగిరిని జిల్లాగా మార్చాలని తాను సూచించిన విజన్ 2035 డాక్యుమెంట్ అమలుపరచాలని తద్వారా ప్రభుత్వానికి ఒక లక్ష కోట్ల రూపాయలు ఆదాయం వస్తుందని ఆయన లేఖలు రాసుకున్నాడు.

## పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణ

- నూతన నిర్మాణాలు తనిఖీ - భవనాలకు కొలతలు వేసిన కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, అక్టోబర్ 28, ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక బి.వి నగర్ ప్రాంతంలో గురువారం ఆకస్మికంగా పర్యటించారు. స్థానికంగా నిర్మాణం అవుతున్న భవనాన్ని తనిఖీ చేసే పట్టణ ప్రణాళిక విభాగం మంజూరు చేసిన అనుమతులను పరిశీలించారు. భవనానికి సంబంధించి అసెస్మెంట్ డిమాండ్ తనిఖీ చేసి కొలతలను వేసి పరిశీలించారు. ఉమ్మారెడ్డి గుంట ప్రాంతంలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న అదనపు అంతస్తు పనులను కమిషనర్ ఆపివేయించారు. నోటీసులు జారీ చేయాలని కమిషనర్ టౌన్ ప్లానింగ్ ఆదేశించారు. ఇస్కాన్ సిటీ ప్రాంతంలోని కాలువ గట్టుపై ఏర్పాటు చేసిన దుకాణాలు, ఇళ్లను తొలగించి కాలువ ఆక్రమణలకు గురవకుండా చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం, రెవెన్యూ అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శివపార్వతుల ఆశీసులు ప్రజలందరిపై ఉండాలి



**నెల్లూరు, అక్టోబర్ 30, ప్రభాతవార్త-విద్య :** కార్తీక మాసం నేపథ్యంలో కోటి సోమవారం సందర్భంగా శివ పార్వతుల ఆశీసులు ప్రజలందరిపై ఉండాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆకాంక్షి ంచారు. గురువారం సాయంత్రం నెల్లూరు నగరంలోని మూలాపేటలో ఉన్న శ్రీ మూలస్థానేశ్వరస్వామివారిని, అమ్మవార్లను వారు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రశాంతమ్మ మాట్లాడుతూ.. కార్తీక మాసంలో స్వామివారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్తీక మాసానికి ప్రత్యేక విశిష్టత ఉందని చెప్పారు. స్వామివారి ఆశీసులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షి ంచారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## హౌసింగ్, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి నేడు జిల్లాకు రాక



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబర్ 30, ప్రభతవార్త** రాష్ట్ర హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి 31 (శుక్రవారం)న జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి అక్టోబర్ 31వ తేదీ ఉదయం 6.00 గంటలకు కృష్ణా జిల్లా, తాడిగడప వివాన్ కేఎంవీ రెసిడెన్సీ నుండి రోడ్డు మార్గం ద్వారా బయలుదేరి, ఉదయం 9.00 గంటలకు నెల్లూరు హోటల్ మినర్వా గ్రాండ్ కు చేరుకుంటారు. అనంతరం ఉదయం 10.00 గంటలకు హోటల్ మినర్వా గ్రాండ్ నుండి బయలుదేరి, ఉదయం 10.05 గంటలకు నెల్లూరు నగరంలోని మగుంట లేఅవుట్స్‌లోని అనిల్ గార్డెన్స్ వద్ద జరిగే వివాహ కార్యక్రమంలో పాల్గొంటారు. వివాహ కార్యక్రమం అనంతరం మధ్యాహ్నం 1.45 గంటలకు అనిల్ గార్డెన్స్ నుండి బయలుదేరి, మధ్యాహ్నం 2.00 గంటలకు స్థానిక జిల్లా టీడీపీ కార్యాలయం చేరుకుంటారు. మధ్యాహ్నం 2.00 గంటల నుండి 2.30 గంటల వరకు ప్రెస్ మీట్ లో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 2.30 గంటలకు జిల్లా టీడీపీ కార్యాలయం నుండి బయలుదేరి, మధ్యాహ్నం 2.40 గంటలకు హోటల్ మినర్వా గ్రాండ్ చేరుకుంటారు. అక్కడ కొంతసేపు విశ్రాంతి తీసుకుని, మధ్యాహ్నం 3.30 గంటలకు హోటల్ నుండి రోడ్డు మార్గం ద్వారా బయలుదేరి, సాయంత్రం 6.30 గంటలకు కృష్ణా జిల్లా, తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని వివాన్ కేఎంవీ రెసిడెన్సీ చేరుకుంటారని పేర్కొన్నారు.

## చిరు వ్యాపారులకు తోపుడు బండి అందజేసిన వేమిరెడ్డి దంపతులు



**కోవూరు, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** మహిళకు తోపుడు బండి ఇచ్చి ఆమె జీవనోపాధికి చేయూత ఇచ్చారు వేమిరెడ్డి దంపతులు. నెల్లూరు నగరం మాగుంట లేఅవుట్‌లోని వీపీఆర్ నివాసంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి బుచ్చిరెడ్డిపాలెం పట్టణ పరిధిలోని కాశీపాలెం ప్రాంతానికి చెందిన కూరగాయాల వ్యాపారం చేసుకునే రాణి అనే పేద మహిళకు తోపుడు బండి ఇచ్చి ఆదుకున్నారు. వారు ఈ సందర్భంగా జీవనోపాధి కోసం కష్టపడుతున్న చిరు వ్యాపారులకు వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా చేయూత ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు చేసిన ఈ సహాయం తాను ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని చిరు వ్యాపారి రాణి అనే మహిళ వేమిరెడ్డి దంపతుల దాతృత్వాన్ని ప్రశంసించింది. ఇందుకూరుపేట టీడీపీ మండల అధ్యక్షులు ఏకొల్లు పవన్ కుమార్‌రెడ్డి, టీడీపీ నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, కేవీ శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఇంచార్జ్ మంత్రికి స్వాగతం పలికిన కావలి ఎమ్మెల్యే



**కావలి, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** కావలి పట్టణంలో గురువారం పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విచ్చేసిన జిల్లా ఇంచార్జ్ మంత్రి ఎండి.ఫరూక్ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి కి స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నందు కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఘనంగా స్వాగతం పలికి వారిని దృశ్యాలవాలతో ఘనంగా సత్కరించడం జరిగింది. అనంతరం కావలి నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి పనులు, తదితర అంశాలపై చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పోస్టుగంటి అలేఖ్య, టిడిపి నాయకులు కండ్లగుంట మధుబాబు నాయుడు, నాయుడు రాంప్రసాద్, పోతుగంటి శ్రీకాంత్ తదితర టిడిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాకు ఎంతో ఆప్తులు మాలేపాటి సుబ్బానాయుడు

- ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతమ్మ
- పార్టీ అధికారంలో లేని రోజుల్లోనే పార్టీని ఇక్కడ నిలబెట్టారు
- ఇద్దరు మంచి లీడర్లను కోల్పోయాం
- తమవంతు మద్దతు మాలేపాటి కుటుంబానికి ఎప్పుడూ ఉంటుంది





**దగదర్తి, అక్టోబర్ 30, ప్రభాతవార్త** ఇటీవల ఆకస్మిక మృతి చెందిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు, భాను చందర్‌ల చిత్రపటాలకు నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు నివాళులర్పించారు. గురువారం మాలేపాటి సుబ్బానాయుడు, భాను చందర్ దశదిన కర్మలో పాల్గొన్న వేమిరెడ్డి దంపతులు.. ఈ సందర్భంగా ఆయనతో ఉన్న అనుబంధాన్నిగుర్తు చేసుకున్నారు. ఇలాంటి కార్యక్రమంలో పాల్గొనేందుకు దగదర్తి రావడం విచారకరమన్నారు. పార్టీ అధికారంలో లేని రోజుల్లోనే పార్టీని నిలబెట్టారని చెప్పారు. పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడి పని చేసిన ఇద్దరు మంచి నాయకులను కోల్పోవడం బాధాకరమన్నారు. మాలేపాటి సుబ్బానాయుడు తమకు ఎంతో ఆప్తులని, వారి మృతి తీరని లోటన్నారు. దగదర్తి మండల అధ్యక్షుడిగా, కావలి నియోజకవర్గ ఇన్‌చార్జిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పార్టీకి, ప్రజలకు ఉత్తమ సేవలు అందించారని గుర్తు చేశారు. మాలేపాటి సుబ్బానాయుడు చివరి కార్యక్రమం మా కోవూరులో జరిగిందని గుర్తు చేశారు. పార్టీ కోసం క్రమశిక్షణతో పని చేయడమే కాక మచ్చలేని నాయకుడిగా గుర్తింపు పొందారని, ఎంతో ఆప్యాయంగా ఉండే కుటుంబ సభ్యుడిని కోల్పోయామన్నారు. సుబ్బానాయుడు కుటుంబానికి భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫలించిన యత్నం-ఒడ్డుకు చేరిన బోటు

- జిల్లా కలెక్టర్ ముందస్తు చర్యలతో తప్పిన పెనుప్రమాదం
- జిల్లా కలెక్టర్,జిల్లా ఎస్పి కృషి ని అభినందించిన మంత్రి నారాలోకేష్



**సంగం, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** జిల్లాకలెక్టర్ చొరవతో సంగం బ్యారేజికి పెద్ద ముప్పు తప్పింది. సంగం బ్యారేజి వద్దకు లంగరు తెగిపోయిన 30 టన్నుల బరువు వున్న ఇసుక బోటు సంగం ఆనకట్ట వద్దకు వచ్చి షట్టర్లపైన ఆగిపోయింది. అదే ఆబోటు బ్యారేజిని నీటి వేగంలో వెళ్ళి ఢీకొని వుంటే బ్యారేజికి పెద్ద ప్రమాదం జరిగింది ఉండేది. స్దానికులు సంగం ఆనకట్ట షట్టర్లపై ఆగిపోయిన విషయాన్ని అధికారులకు తెలియజేయడంతో మండల స్థాయి అధికారులు వెంటనే జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకి,జిల్లా ఎస్పి అజితా వెజండ్లకు సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే స్పందించి సంగం బ్యారేజి వద్దకు చేరుకున్నారు. జిల్లా కలెక్టర్ యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకొని ఎన్‌డిఆర్ఎఫ్,ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలను కృష్ణపట్నం పోర్టు గస్తీబృందాన్ని రంగంలోకి దింపారు. 30 టన్నుల బోటును ఒడ్డుకు చేర్చడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. జిల్లా కలెక్టర్ కృషికి ప్రతి ఒక్కరు హ్యాట్సాఫ్ అన్నారు.

**విద్యాశాఖ మంత్రి లోకేశ్ జిల్లా కలెక్టర్‌కి అభినందనలు**

సంగం బ్యారేజి వద్ద లంగరు తెగిపోయిన 30 టన్నుల బరువున్న ఇసుక బోటు గేట్లు వరకు రాకుండా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా ఎస్పి అజితా వెజండ్లని ఆయన అబినిందించారు. అలాగే ఎన్‌డిఆర్ఎఫ్ బృందం,ఎస్‌డిఆర్ఎఫ్ బృందాన్ని, పోలీసులను, ఇరిగేషన్, మండల స్దాయి అధికారులందరికి ప్రశంసలు దక్కాయి.

❖ ఎన్‌డిఆర్ఎఫ్,ఎస్‌డిఆర్ఎఫ్ బృందాల సేవలను అభినందిస్తు ఆత్మకూరు ఆర్‌డిఒ పావని, తహసిల్దారు సోమ్లానాయక్, వారికి శాలువాలు కప్పి పూలమాలలు వేసి సన్మానించారు.
వారి సేవలను అభినందించారు.

# స్త్రీలకు మనోధైర్యమే ఆయుధం

- సమాజానికి ఉత్తమ పౌరులు అందించడంలో స్త్రీల పాత్ర కీలకం
- జీవితంలో ఒడిదుడుకులను ఓర్పుతో ఎదుర్కోవాలి
- సహనం మహిళల పాలిట ఆభరణం
- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి





**కోవూరు, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** ఎవరో ఏదో అనుకుంటారని వెనుకడుగు వేసే స్వభావం వీడి మహిళలు అన్ని రంగాలలో ముందుకు సాగాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పిలుపునిచ్చారు. నెల్లూరు నగరంలోని టౌన్ హాల్లో శ్రీ పరంజ్యోతి స్త్రీ శక్తి అనే కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మహిళలను ఉద్దేశించి తమ అమూల్య సందేశాన్ని అందించారు. స్త్రీలు స్వతహాగా శక్తివంతులని తమలో అంతర్లీనంగా దాగి ఉన్న శక్తిని వెలికి తీసి ప్రపంచానికి చాటాలని కోరారు. కాపురాన్ని చెక్కబెడుతూ పిల్లల భవిష్యత్తును తమ ఔన్నత్యం చాటుకోవాలని కోరారు. సమాజానికి ఉత్తమ పౌరులు అందించడంలో స్త్రీల పాత్ర కీలకమన్నారు. జీవితంలో ఒడిదుడుకులను ఓర్పుతో ఎదుర్కోవాలని ఎటువంటి పరిస్థితులలో మనోధైర్యం కోల్పోకూడదని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి హితవు పలికారు. సహనం మహిళల పాలిట ఆభరణమని మహిలలు ఆత్మభిమానంతో జీవించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సౌజన్య భగవత్ దాసాజి భారతి, అనిత, రమణయ్య, కిషోర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## తుఫాన్ బాధితులకు బియ్యం పంపిణీ



**సైదాపురం, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** మొంథా తుఫాన్ ప్రభావంతో గ్రామాల్లోకి నీరు చేరడంతో పునరావాస కేంద్రాల్లో ఉన్న బాధితులకు తహసీల్దార్ ఎం. సుభద్ర ఆధ్వర్యంలో గురువారం రేషన్ కార్డు కలిగిన బాధితులకు బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుభద్ర మాట్లాడుతూ తుఫాన్ కారణంగా కట్టుబడిపల్లి, ఊటుకూరు పంచాయతీ పరిధిలోని మిక్స్‌డ్ కాలనీలో నీరు చేరడంతో వారిని సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించడం జరిగిందని, వారికి రేషన్ కార్డు కలిగిన 87మంది లబ్దిదారులకు ముందుగా రేషన్ బియ్యం పంపిణీ చేయడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డీటీ ఇలియాజ్, ఆర్ఐ ప్రదీప్, నాయకులు దశయ్య నాయుడు, ప్రసన్న కుమార్‌రెడ్డి, ప్రతాప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పిన్నేరు వాగుపై రాకపోకలు పునరుద్దరణ



**సైదాపురం, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** మండల పరిధిలోని తురిమెర్ల గ్రామ సమీపంలో ఉన్న పిన్నేరు వాగుపై గురువారం మధ్యాహ్నం 3గంటల నుండి అధికారులు రాకపోకలను పునరుద్దరణ చేశారు. గత కొన్ని రోజులుగా డ్యామ్ నీరు వర్షపు నీటితో పిన్నేరు వాగు ఉధృతంగా ప్రవహించడంతో అధికారులు పూర్తిగా రాకపోకలను నిలిపివేశారు. దీంతో సైదాపురం, పొదలకూరు రోడ్డు మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయింది. గురువారానికి పిన్నేరు వాగుపై నీరు తగ్గుముఖం పట్టడంతో రాకపోకలను పునరుద్దరణ చేశారు.

# యూనిటీ మార్చ్‌లో పాల్గొని విజయవంతం చేయండి

## - ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పిలుపు



**నెల్లూరు రూరల్, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** ఉక్కు మనిషి, దేశ తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 వ జయంతి సందర్భంగా అక్టోబర్ 31న నెల్లూరులో జరిగే యూనిటీ మార్చ్ పాదయాత్రలో యువత, వివిధ రంగాల నిపుణులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సంవత్సరం జాతీయ సమైక్యతా నిర్మాత సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి అని తెలిపారు. ఆయన అసాధారణ కృషి, వారసత్వాన్ని గౌరవిస్తూ, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ సర్దార్ 150 అనే కార్యక్రమాన్ని ప్రారంభిస్తోందని చెప్పారు. ఏక్తా దివస్ సందర్భంగా అక్టోబర్ 31న ఉదయం సర్దార్ 150 యూనిట్ మార్చ్ అనే పేరుతో మై భారత్ నెల్లూరు, ఎన్ఎస్ఎస్, జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని వీఆర్సీ మైదానం నుంచి వేదాయపాలెం వరకు నిర్వహించే 5 కిలోమీటర్ల పాదయాత్రను జయప్రదం చేయాలన్నారు. దేశ సమైక్యతలో పౌరులను వికసిత్ అండ్ ఆత్మనిర్భర్ భారత్ వైపు నడిపించడంతో పాటు సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను గౌరవించడం ఈ పాయయాత్ర ఉద్దేశమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో పాల్గొని సర్దార్ వల్లభాయ్ పటేల్ వారసత్వం కాపాడుకోవడంతో పాటు ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కంకణబద్దులవ్వాలన్నారు.

## ఏఎస్‌పేటలో ప్రవేట్‌బస్సులను తనిఖీ చేసిన మోటార్‌వెహికల్ ఇన్స్‌పెక్టర్



**అనుమసముద్రంపేట ,అక్టోబరు30,ప్రభాతవార్త:** ఇటీవల కర్నూల్‌లో జరిగిన బస్సు ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకొని ఏఎస్‌పేట నుండి హైదరాబాద్‌కు వెళ్ళే ప్రవేట్ ట్రావెల్స్ బస్సులను ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ రాములు గురువారం బస్సులను ఏఎస్‌పేటలోని దొరసానమ్మ తోటలో తనిఖీ చేశారు. ఈ సంద ర్భంగా ఆయన బస్సు యాజమాన్యం, బస్సు నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రయాణీకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బస్సులను నడపాలని, బస్సులను ఎప్పటికప్పుడు ఎలాంటి సాంకేతిక లోపాలకు గురికాకుండా చూడాలన్నారు. 2019 ఏప్రిల్ లోపు తయారైన ప్రతి బండికి ఫైర్ డిటెక్షన్ అలారం తప్పకుండా ఉండాలన్నారు, 01-10-2023నుండి తయారైన బస్సులకు బస్సు ఇంజన్‌కే కాకుండా లోపల ఉండే కంపార్ట్‌మెంట్‌లకు కూడా ఫైర్ డిటెక్షన్ అలారం ఉండాలన్నారు. అలా కాదని వ్యవహరిస్తే వారిపై చర్యలు తీసుకొని బస్సులను సీజ్ చేస్తామని రాములు పేర్కొన్నారు. కావున బస్సు యజమాలను ఈ విషయాలను గమనించి ప్రజల ప్రాణాలను కాపాడాలని ఆయన కోరారు.

## పారిశుధ్యంపై అధికారులు చర్యలు



**వింజమూరు, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** వింజమూరు పంచాయతీ పరిధిలోని జీబీకేఆర్ఎస్‌టీ కాలనీ యందు పారిశుధ్యం మెరుగుకై పంచాయతీ కార్యదర్శి కే.రామారావు ఆధ్వర్యంలో ఈ చర్యలు చేపట్టారు. ప్రస్తుతం మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాల వల్ల కాలనీ అంతటా పరిశుభ్రత దెబ్బతిన్నట్లు ఆ ప్రాంతాన్ని పరిశీలించి కాలనీ వాసుల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు అనారోగ్య పరిస్థితి నుంచి ఆరోగ్య పరిస్థితి కాపాడేందుకు పారిశుధ్య పనులను చేపట్టారు. ఎంపీడీవో కే.శ్రీనివాసరెడ్డి పారిశుధ్య పనులను పరిశీలించారు. పంచాయతీ సిబ్బంది బ్లీచింగ్ చల్లి దోమల వృద్దిని అరికట్టే విధంగా చర్యలు చేపట్టారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య సిబ్బంది ఉన్నారు.

## రామచంద్రాపురం వైసిపి నేతను పరామర్శించిన ప్రసన్నకుమార్‌రెడ్డి



**బుచ్చి అక్టోబర్ 30 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు బొద్దు హనుమారెడ్డి తండ్రి బొద్దు కృష్ణారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో నేడు రామచంద్రాపురంలోని వారి స్వగృహానికి వెళ్ళి వారి ఉత్తర క్రియలలో పాల్గొని మాజీ మంత్రి వర్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈకార్యక్రమంలో బుచ్చిరెడ్డిపాళెం రూరల్ అధ్యక్షులు చెర్లో సతీష్‌రెడ్డి,బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాల్టీ అధ్యక్షులు షేక్ షాహుల్ పాల్గొన్నారు.

## పోలీస్ మైదానంలో ఓపెన్ హౌస్ కార్యక్రమం



**నెల్లూరు క్రైం, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా గురువారం స్థానిక పోలీస్ కవాతు మైదానంలోని ఉమేష్ చంద్ర సమావేశ మందిరంలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అదనపు ఎస్పీ సిహెచ్ సౌజన్య ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇది నిర్వహణలో భాగంగా పోలీసు సిబ్బంది ఉపయోగించే ఆయుధాలను విద్యార్థులకు అవగాహన కోసం ప్రదర్శించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రదర్శనకు ఉంచిన ఆయుధాలను నగరంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు తిలకించారు. ఆయుధాలను ఉపయోగించే విధానాన్ని పోలీస్ సిబ్బంది విద్యార్థులకు వివరిస్తుండగా అందరూ ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో ఎస్బి డిఎస్పి శ్రీనివాసరావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.**- నగరంలో కొవ్వొత్తుల ర్యాలీ** పోలీస్ అమరవీరుల సంస్కరణ వారోత్సవాలలో భాగంగా గురువారం సాయంత్రం నగరంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఎస్పీ అజిత వేజెండ్ల ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పోలీస్ కవాతు మైదానం నుండి కెవిఆర్ పెట్రోల్ బంక్ సర్కిల్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయి, డివిజన్ స్థాయి పోలీస్ అధికారులు, నగరంలోని పలువురు సిఐలు ఇద్దరు సిబ్బంది పాల్గొన్నారు.

## 13 మంది పేకాట రాయుళ్ల అరెస్టు



**నెల్లూరు క్రైమ్, అక్టోబర్ 30, ప్రభాతవార్త:** బాలాజీ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామచంద్రపురం సమీపంలో పేకాట ఆడుతున్న 13 మంది పేకాట రాయులను బాలాజీ నగర్ సిఐ సాంబశివరావు నేతృత్వంలో పోలీస్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 11 సెల్ ఫోన్లు, ఆరు స్కూటర్లు, ఒక కారు, రూ. 95 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

## కూటమి పాలనలో వైద్యం విలాసం పేదలకు కరువు



**తోటపల్లి గూడూరు, అక్టోబర్ 30 ప్రభాతవార్త:** ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో పేద ప్రజలకు వైద్యం కరువైందని వైఎస్ఆర్సీపీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాని పూజితమ్మ తీవ్రంగా విమర్శించారు. ఈదూరులో స్థానిక వైఎస్ ఆర్సీపీ నాయకులు టంగుటూరు పద్మనాభరెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం"లో ఆమె పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం విద్య, వైద్యం రంగాల్లో పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. పేదలకు ఉచితంగా వైద్యం అందించే ఆరోగ్యశ్రీ పథకాన్ని బిల్లుల పేరుతో నిలిపివేయడం, ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటు చేతుల్లోకి ఇవ్వడం ప్రజావ్యతిరేక నిర్ణయమని ఆమె దుయ్యబట్టారు. గత వైఎస్ఆర్సీపీ ప్రభుత్వం నిర్మించిన సగానికి పైగా మెడికల్ కాలేజీలను ఈ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వదిలేసిందని ఆవేదన వ్యక్తం చేశారు." ప్రభుత్వం తన అనాలోచిత నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని మెడికల్ కళాశాలను ప్రభుత్వ ఆధ్వర్యంలోనే కొన సాగించాలి,అని పూజితమ్మ డిమాండ్ చేశారు. మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్య గౌడ్, నాయకులు టంగుటూరు పద్మనాభరెడ్డి, మన్యం సుబ్రహ్మణ్యం, చెరుకూరు శ్రీనివాసులు నాయుడు, టంగుటూరు సురేష్ రెడ్డి, మన్యం చిరంజీవులు గౌడ్, కాల్తి రెడ్డి సుబ్రహ్మణ్యం, ఏంబేటి శేషమ్మ, తూపిలి ఉదయ్ కుమార్ రెడ్డి, నెల్లిపూడి సునీల్ రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి గుండాల వంశి రెడ్డి, టంగుటూరి శ్రీలక్ష్మి, ఉప్పల స్వర్ణలత, ఇనకాళ్ల వేణు, సంధ్యారాణి, ఒబ్బారెడ్డి సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ క్లోరినేషన్, సూపర్ శానిటేషన్ కార్యక్రమాలను చేపట్టాలి

**కావలి, అక్టోబర్ 30, ప్రభాతవార్త:**పంచాయతీరాజ్ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనలతో సూపర్ క్లోరినేషన్,సూపర్ శానిటేషన్ కార్యక్రమాన్ని చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి లక్కిరెడ్డి శ్రీధర్ రెడ్డి తెలియజేశారు. కావలి మండల పరిషత్ కార్యాలయం నందు గురువారం లక్కిరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడారు తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలతో గ్రామాల్లో మెరుగైన పారిశుధ్యం, శుద్ధిచేసిన నీటిని అందించేందుకు జిల్లా వ్యాప్తంగా చర్యలు చేపట్టామని తెలియజేశారు. సూపర్ క్లోరినేషన్ సూపర్ శానిటేషన్ లో భాగంగా అధిక వర్షపాతం నమోదైన కావలి మండలంలో పరిస్థితులను తెలుసుకోవడం జరిగిందన్నారు.దీని యొక్క ముఖ్య ఉద్దేశాన్ని తెలియజేశారు.నీటి నిలువలు లేకుండా చేయడం, బ్లీచింగ్,పెనాయిల్, మాలతీయం వంటి దోమల మందుల నిల్వలు ఉంచుకోవడం పాగింగ్ యంత్రాలు ఉపయోగం లో ఉండేటట్లు చూసుకోవడం త్రాగునీటిని క్లోరినేషన్ చేసి అందించాలని తెలియజేశారు నాలుగు రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో డిఎల్ పిఓ వెంకటరమణ,ఎంపీడీవో చేవూరు శ్రీదేవి,పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

## బొల్లినేని దాతృత్వం గాయపడ్డ బాలికకు రు. 50 వేలు అందజేత



**కలిగిరి, అక్టోబర్30, ప్రభాతవార్త;** ఉదయగిరి మాజీ శాసన సభ్యులు, తెలుగుదేశంపార్టీ జాతీయ ఉపాధ్యక్షులు బొల్లినేని వెంకట రామారావు తన దాతృత్వాన్ని చాటుకున్నారు. తూర్పు దూబగుంటకు చెందిన చవలమూడి బాబుకుటుంబం లారీ ప్రమాదంలో మృతిచెందగా అందులోఒకబాలిక బతికి గాయాలతో వైద్యం పొందుతుంది. విషయం తెలుసుకున్న బొల్లినేని, ఉదయగిరి మాజీ శాసన సభ్యులు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డితో గురువారం దూబగుంట గ్రామానికి వెళ్లి గ్రామస్తు లతో కలసి లారీ ప్రమాదంలో గయపడిన చవలమూడి మేఘన ఆరోగ్య పరిస్తితులను అక్కడ ఉన్న వారిని అడిగి తెలుసుకున్నారు. అదేవిదంగా సంఘటన జరిగిన వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసు కున్నారు. మంచంలో ఉన్న మేఘనను చూసి బొల్లినేని చలించిపోయారు. ఈసందర్భంగా కుటుం బసభ్యులతో మాట్లాడిన ఆయన పాప ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని, పార్టీ పరంగా సహాయ సహకా రాలు అందుతాయని బరోసా ఇచ్చారు. అతేగాక మేఘన వైద్యఖర్చులకు గాను తన వంతు సహాయ ంగారు. 50వేలరూపాయలను కుటుంబసబ్యులకు అందజేశారు. బొల్లినేని వెంట మాజీ యంఎల్ఏ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి,తదితర నాయకులు పాల్గొన్నారు.అనంతరం కలిగిరి మండలం కొత్తూరుకు చెందిన కేతినేని సాబశివరావు కుమార్తె తేజస్విని నలుగు కార్యక్రమానికి హాజరై పెండ్లి కుమార్తెను ఆశీర్వదించారు.

## లతీఫ్ కుటుంబాన్ని పరామర్శించిన పోలంరెడ్డి



**కోవూరు, అక్టోబరు 30 ప్రభాతవార్త :** కోవూరు మండలం గంగవరం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు షేక్. ఖాజా రంతుల్లా చిన్న కుమారుడు షేక్ అబ్దుల్ లతీఫ్ ఇటీవల అకాల మరణం చెందారు. ఈ మేరకు వారి కుటుంబాన్ని గురువారం మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆంధ్రప్రదేశ్ ఎన్విరాన్‌మెంట్ మనేజ్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డిలు వెళ్లి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. చిన్న వయస్సు లోనే ఆకస్మిక మరణం చెందడం ఆ కుటుంబానికి తీరని లోటేనని ఈ సమయంలో ఆ కుటుంబానికి భగవంతుడు మనోధైర్యం ఇవ్వాలని ఈ సందర్భంగా వారు ఓదార్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉప సర్పంచ్ మోషా, చంద్రయ్య, శివకుమార్, నాగేంద్ర, సురేష్, శ్రీనివాసులు, బాబు, తదితరులు ఉన్నారు.

## యూరియా విషయంలో ఆందోళన చెందవద్దు



**కోవూరు, అక్టోబరు 30 ప్రభాతవార్త :** ప్రస్తుతం వ్యవసాయం సాగు చేసే రైతులు యూరియా విషయంలో ఎటువంటి ఆందోళన చెందవల్సిన అవసరం లేదని సహాయ వ్యవసాయ సంచాలకులు జి. అనిత అన్నారు. కోవూరు మండలం పాటూరు గ్రామంలో ఉన్న రైతుసేవా కేంద్రంలో గురువారం ఆ ప్రాంత రైతులకు యూరియా బస్తాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాటూరు రైతు సేవా కేంద్రంలో 18 టన్నుల యూరియా ఉందని, అదే విధంగా చెర్లోపాలెం రైతు సేవా కేంద్రంలో 18 టన్నులు, పడుగుపాడు సహకార సొసైటీకి 20 టన్నుల యూరియా స్టాక్ సిద్ధంగా ఉన్నాయన్నారు. యూరియా కావాల్సిన రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో యూరియా కార్డులు తీసుకుని యూరియా పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి టి. రజని, గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రభ , రైతులు ఉన్నారు.

## 27 వేల రుద్రాక్షలకు ప్రత్యేక పూజలు



**కోవూరు, అక్టోబరు 30 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కామాక్షి సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో కార్తీక మాసంలో వచ్చే కోటి సోమవారం పర్వదినం సందర్భంగా ఆ మహదేవునికి హరిద్వార్ నుంచి ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథం సుబ్బరామయ్య ప్రత్యేకంగా తెప్పించిన 27 వేల రుద్రాక్షలకు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రుద్రాక్షలకు హరిద్వార్‌లో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడి నుంచి సాంప్రదాయబద్దంగా దేవాలయానికి తీసుకురావడం జరిగిందన్నారు. ఈ కార్తీక మాసం సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు వీటిని పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## నెల్లూరులో తుఫాన్ బాధితులకు నిత్యవసర సరుకులు పంపిణీ



**నెల్లూరు, అక్టోబర్ 30, ప్రభాతవార్త-వైద్యం :** బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చిన రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ విపత్తుల సమయంలో బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్న నెల్లూరు ఆర్డీఓ అనూష, తహసిల్దార్ షఫీ మాలిక్ మొంధా తుఫాన్ ప్రభావంతో గడిచిన కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురిసాయి. ఈ నేపథ్యంలో తుఫాన్ ప్రభావంతో ఇబ్బందులు పడ్డ కుటుంబాలను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం సహాయక చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో రాష్ట్ర పురపాలక పట్టణ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ ఆదేశాల మేరకు నెల్లూరులోని బాలాజీ నగర్ 68వ రేషన్ షాప్ లో తుఫాన్ బాధిత కుటుంబాలకు నెల్లూరు ఆర్డీఓ అనూష, తహసిల్దార్ షఫీ మాలిక్ ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. తుఫాన్ ప్రభావం వల్ల తీవ్రంగా నష్టపోయిన కుటుంబాలను ఎంపిక చేసి వారికి మంత్రి నారాయణ ఆదేశాల మేరకు నిత్యవసర సరుకులను అందజేయడం జరుగుతుందని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. విపత్తుల సమయంలో బాధ్యత కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక సర్వే ద్వారా నష్టపోయిన బాధితులను ఎంపిక చేసి తగిన సహాయం అందించడం జరుగుతుందని, ఇందులో భాగంగా నిత్యవసర సరుకులను అందిం చినట్లు చెప్పారు. అయితే ప్రస్తుతం ఇబ్బందులు పడుతున్న తమను ఆదుకున్న కూటమి ప్రభు త్వానికి, మంత్రి నారాయణకు, అధికారులకు తుఫానుబాధితులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో 15వ డివిజన్ ప్రెసిడెంట్ రీశి చౌదరి, 16వ డివిజన్ అధ్యక్షుడు సాయి, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, దశరధరామయ్య, నరేంద్ర, షమీమ్,మాధవరావు, సురేష్ ,రేజుదీ ప్రసాద్ ,రాజు, రవికు మార్,తదితరులు పాల్గొన్నారు

## ఆర్టీఓ దాడులు.. ప్రైవేటు ట్రావెలర్ బస్సు సీజ్



**వింజమూరు, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** కర్నూలు జిల్లా చిన్నటేకూరు వద్ద ఇటీవల జరిగిన బస్సు అగ్ని ప్రమాదంను దృష్టిలో ఉంచుకుని ఆర్టీవో అధికారులు అప్రమత్తమయ్యారు. అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా రవాణా శాఖ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే వింజమూరులో గురువారం ఆర్డీఓ పి.మురళి ధర్ ఆధ్వర్యంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఆర్.సుందర్‌రావు, ఏఎంవీఐ కరుణాకర్ లక్ష్మీ బాయిలతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఫైర్ ఎగ్జిస్టింట్‌కు సంబంధించి పరికరాలు లేకపోవడంతో ఆ బస్సును సీజ్ చేసినట్లు ఆర్డీఓ తెలిపారు. అదే విధంగా అన్ని ప్రైవేటు బస్సులను తనిఖీ చేసి నిబంధనలు అతిక్రమించినట్లయితే చీజ్ చేస్తామని తెలిపారు. ప్రైవేటు వాహనదారులు రోడ్డు రవాణా నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకోబడతాయని ఆయన తెలిపారు.

## క్రమం తప్పకుండా క్లోరినేషన్ తప్పనిసరి



**కోవూరు, అక్టోబరు 30 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న రక్షిత నీటి పథకాలను క్రమం తప్పకుండా క్లోరినేషన్ చేసేలా సంబంధిత పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి అన్నారు. కోవూరు మండల పరిధిలోని పోతిరెడ్డిపాలెం, ఇనమడుగు, తదితర ప్రాంతాల్లో ఉన్న రక్షిత నీటి పథకాలను గురువారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ప్రసాద్‌రావు, కరుణ, తదితరులు ఉన్నారు. **- వాటర్ టెస్ట్ చేసిన డిప్యూటీ ఎంపీడీవో** కోవూరు మండలం వేగూరు కండ్రిగ ప్రాంతంలో ఉన్న రక్షిత నీటి పథకం ప్రాంతంలో గురువారం డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు వాటర్ టెస్టింగ్ కిట్‌తో ప్రజల సమక్షంలోనే పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా కిట్ ద్వారా వచ్చిన ఫలితాలను ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించారు. ప్రస్తుతం ఈ సీజన్‌లో తప్పనిసరిగా ఈ కిట్ల ద్వారా నీటిని పరిశీలన చేయాలని పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లుకు సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

## వైభవంగా కోటి సోమవారం పూజలు



**కోవూరు, అక్టోబరు 30 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కామాక్షి సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో కార్తీక మాసంలో వచ్చే కోటి సోమ వారం పర్వదినం సందర్భంగా ఆలమాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ప్రాత: కాలమునే మహిళలు ఆలయంలో పూజలు చేపట్టారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రధాన అర్చకులు విశ్వనాథం సుబ్బరామయ్య ఆధ్వర్యంలో వమన్యాసపూరక రుద్రాభిషేక పూజలను సాంప్రదాయబద్దంగా నిర్వహించారు. అనంతరం వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రుత్వికులు మురళిస్వామి, వంశీ స్వామి, సాయి స్వామి, శేఖర్‌స్వామి, శ్రీనివాసులు స్వామి, తదితరులు ఉన్నారు.

## సి.వి.కె.జి.జె.సికి పూర్వ విద్యార్థుల కుర్చీల వితరణ



**రాపూరు, అక్టోబరు30ప్రభాతవార్త :** మండల కేంద్రమైన రాపూరులోని సివికె ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 1989..90 పదవ తరగతి విద్యార్థులు గురువారం కుర్చిలను ఆందజేశారు. ఇటీవల ఈ కళాశాలలో పదవతరగతి చదివిన పూర్వ విద్యార్థులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కళాశాలతో వారికి వున్న అనుభందాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ సందర్బంగా వారి గుర్తుగా కళాశాలకు 4 కుర్చిలను మండల కోఆప్షన్ ఎస్‌డి సయ్యద్,షేక్ నజీర్, సయ్యద్ గౌస్ భాషాలు ప్రిన్స్‌పాల్ బి. క్రిష్ణవేణికి ఆందజేశారు.

## ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి సేవలు మరువలేనివి



**విడవలూరు, అక్టోబర్ 30 ప్రభాతవార్త:** తుఫాన్ పట్ల కోవూరు నియోజకవర్గంలో ఏ ఒక్కరికి ప్రాణ నష్టం కలగకుండా అధికారులను, నాయకులను అప్రమత్తం చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి వారికి అన్ని సదుపాయాలు కల్పించిన తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యురాలు, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సేవలు మరువలేనివని ప్రజాసేవ సంస్థ వ్యవస్థాపకులు కొండూరు బాబు పేర్కొన్నారు. మండలంలోని రామచంద్రపురం పంచాయతీ బసగాడి పాలెం ఎస్టీ కాలనీలో మొంథా తుఫాన్ బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన కాలనీవాసులు పరిశుభ్రంపై జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని అవగాహన కల్పించి మనోధైర్యం చెప్పారు. తుఫాన్ సమయంలో కోవూరు ఎమ్మెల్యే పునరావాస బాధితులకు భోజన సదుపాయం, దుప్పట్ల పంపిణీ చేయడం జరిగింది.మండల అధికారులు, నాయకులు ఆవుల వాసు, రవిచంద్ర, రవీంద్ర, జేజి, చిన్న బాబు, వెంకటేశ్వర్లు సచివాలయం సిబ్బంది నిత్యం ప్రజల పట్ల ఉంటూ సేవలందించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు.అనంతరం గిరిజనులకు అల్పాహారం, పిల్లలకు బిస్కెట్స్ పంపిణీ చేశారు.

## తుఫాన్ బాధిత మత్స్యకారులకు నిత్యావసరాల పంపిణీ



**తోటపల్లి గూడూరు, అక్టోబర్ 30 ప్రభాతవార్త:** నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గం తోటపల్లి గూడూరు మండలం నడిమి మత్స్యకారపాలెంలో గురువారం సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తుఫాన్ సమయంలో పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న గిరిజన మరియు మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం తరఫున ప్రకటించిన బియ్యం, నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తుఫాన్ ప్రభావంతో రెండు మండలాల పరిధిలోని 1,925 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించి, వారికి అవసరమైన అన్ని వసతులను ప్రభుత్వం సమకూర్చిందని తెలిపారు. తుఫాన్ సమయంలో అప్రమత్తంగా వ్యవహరించిన రెవెన్యూ, పోలీసు, విద్యుత్, పంచాయతీ శాఖల అధికారులను ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ద్యామా గంగాభవాని, సుధీర్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, మండల టిడిపి అధ్యక్షులు కొణతం రఘు బాబు, ప్రధాన కార్యదర్శి మన్యం జితేంద్ర, మాజీ కోడూరు నీటి సంఘం అధ్యక్షులు వీరబోయిన గంగాధర్, బైనబోయిన శ్రీనివాసులు, గోపిరెడ్డి వెంకటేశ్వర్లు, పాముంజి గోపి, పాముంజి రమణయ్య, కాటం రాంబాబు, కూనాసి వెంకటరమణయ్య, పామంజి దొరబాబు, కంజి సుధాకర్, భక్తాన్ని రామాంజనేయులు, కంజి సాయిరాం, ఆవుల మునిరత్నం, కొమారి శ్రీనివాసులు, పరదేశి చలపతి, దండు వాసు, శ్రీహరి, తిరుపతి రామలింగయ్య, పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహా ఉద్యమంలా కోటి సంతకాలు సేకరణ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి



**పొదలకూరు, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** మెడికల్ కళాశాల ప్రవేటీకరణను నిరసిస్తూ ప్రజా స్పందన ఉప్పెనల ఎగసిపడుతున్న తరుణంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమంను పొదలకూరు మండలంలోని బిరదవోలు గ్రామంలో ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డా. కాకాణి గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. కాకాణి రాకతో గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందన్నారు. కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భారీగా తరలివచ్చి, బారులు తీరారని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు, మహిళలు, యువత, విద్యార్థులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమానికి పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని మహా ఉద్యమంగా తీర్చిదిద్దిన వారందరికీ పేరుపేరున మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

## 39వ రోజుకు చేరుకున్న లలితా రుద్రహోమం



**సంగం అక్టోబర్ 30 ప్రభాతవార్త :** సంగం తిరమన కొండలో వెలసియున్న శ్రీరాజరాజేశ్వ రీదేవి జ్ఞానపీఠంలో లోక కళ్యాణార్థం ,విశ్వశాం తికొరకు నిర్వహిస్తున్న 45 రోజుల యజ్ఞం 39 వ రోజుకు చేరుకుంది.ఈ కార్యక్రమంలో పీఠాది పతులు శ్రీరాజరాజేశ్వర నాంద స్వామి భక్తులను ద్దేశించి మాట్లాడుతు సమాజంలో ప్రజలందరు యోగ క్షేమల కొసమే గ్రామస్థాయి, నుండి రాష్ట్రస్థాయి వరకు దేవాలయాలు పుణ్యక్షేత్రాలు వెలశాయని స్వామి తెలిపారు. దేశంలో అన్ని దేవాలయాల్లో దూపదీప నైవేద్యాలు, పూజలు,అర్చనలు,యజ్ఞాలు సవ్యంగా జరిగిన రోజే ప్రజలందరు సుఖశాంతులతో ఉంటారని స్వామి వివరించారు. మన తినే ఆహార పదార్ధాలు మన శథీరానికే మాత్రమే వర్తిస్థాయి, యజ్ఞంలో ఉపయోగించే ద్రవ్యాలు అగ్ని దేవుడి ద్వారా దేవతలకు చెందినప్పుడు సకాలంలో వర్షాలు కురువడం, సకల జీవరాజులు సుభిక్షింగా ఉంటారని తెలిపారు. నవంబర్ 5 వతేది కార్తీకపౌర్ణమి సందర్భంగా పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో ప్రజలు పాల్గోని భగవంతుడి అనుగ్రహాన్ని పొందాలని అన్నారు.

## వరద బాధితులను ఆర్థికంగా ఆదుకోవాలి మిడతల రమేష్

– డిఆర్ఓకు సమర్పించిన వినతి పత్రం



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** మొంతా తుఫాన్ నష్ట నివారణ చర్యలు చేపట్టిన జిల్లా ప్రభుత్వ యంత్రాంగానికి ధన్యవాదాలు తెలుపుతూ వరద బాధితులును ఆదుకోవాలని బిజెపి నేతలు మిడతల రమేష్ కందికట్ల రాజేశ్వ రిలు నెల్లూరు డిఆర్ఓ కు వినతిపత్రం సమర్పి ంచారు.నెల్లూరు జిల్లాలో వరుస వర్షాలు తుఫాను ప్రభావంతో 3300 ఎకరాలలో కోతకు వచ్చిన పంట నీట మునిగిందని ఎకరాకు 40000 చొప్పున సుమారు 132 కోట్ల మేర ధాన్యం రైతులు నష్టపోయారని, 1996 చేనేత మగ్గాలలో నీరు చేరడంతో చేనేత కార్మికులు ఉపాధి కోల్పోయారని నీటిపారుదల సెంట్రల్ డివిజన్ పరిధిలో 100 కోట్ల మేర చెరువులు కాలువలు రిజర్వాయర్లు దెబ్బతిన్నాయని అన్నారు. కండలేరు జలాశయ పరిధిలోని బ్రాంచ్ కాలువల గండ్లు వలన రెండు కోట్ల రూపాయలు నష్టం వాటిల్లిందని, కండలేరు ఎర్త్ డ్యాం నిర్మించి 30 సంవత్సరాలు దాటినందున మట్టికట్ట పటిష్టత కోసం 50 కోట్ల రూపాయలు పైగా వ్యయం చేయాల్సి ఉందని తుఫాన్ ప్రభావంతో ఇద్దరు మనుషులు గల్లంతయ్యారని 600 బాతులు, ఆరు గొర్రెలు, తొమ్మిది బర్రెలు మృత్యువాత పడ్డాయి అన్నారు. రోడ్ల మరమ్మత్తుల కోసం 22 కోట్ల రూపాయలు అవసరమవుతుందని, సమగ్ర విచారణ జరిపి తుఫాన్ బాధితులును ఆదుకోవాలని రమేష్ రాజేశ్వరమ్మ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రఘురామయ్య నరాల సుబ్బారెడ్డి, ఏవి సుబ్బయ్య, టి శ్రీనివాసులు, నారా యణ యాదవ్, రాములు యాదవ్, ఆదినారాయణ, అల్లూరు నాగేంద్ర సింగ్ తదితరులు పాల్గొ న్నారు.

## మొంథా తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న ప్రాంతాల్లో పర్యటించిన సీపీఐ నేతలు



**నెల్లూరు అగ్రికల్చర్, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** నెల్లూరు రూరల్ మండలంలో మొంథా తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న ప్రాంతాలను సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల నాగేంద్ర సాయి ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు పరిశీలించారు. ఇందులో భాగంగా ఉరువారం ములుమూడి కలుజు వద్ద వాహనాల రాకపోకలు సక్రమంగా సాగక, ప్రజలు పడుతున్న ఇబ్బందులను స్వయంగా పరిశీలించారు. వాహనదారులు పడుతున్న అవస్థల దృష్ట్యా కలుజు వద్ద వెంటనే బ్రిడ్జిని నిర్మించాలని నినాదాలు చేశారు. సందర్భంగా నాగేంద్ర సాయి మాట్లాడుతూ మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు, ప్రజల ఇళ్లలో నుంచి బయటకి రాలేని పరిస్థితి నెలకొందన్నారు. అనేక గ్రామాల్లో ఇళ్లలోకి నీళ్ల చేరడంతో పనులు కోల్పోయారని, గత 20 రోజులుగా ఏ పనులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. చేనేత మగ్గాల్లోకి నీరు చేరి వారంతా ఉపాధి కోల్పోయారని, చేనేత కుటుంబాలకు తక్షణ ఆర్థిక సాయం కింద 20 వేల నగదు, 25 కేజీల బియ్యాన్ని నిత్యవసర సరుకులను అందజేయాలని డిమాండ్ చేశారు. అలాగే పొట్టెపాలెం కలుజు వద్ద కూడా వెంటనే బ్రిడ్జిని నిర్మించాలని కోరారు. ఈ రెండు కలుజులపై బ్రిడ్జిలు నిర్మిస్తామని నేతలు వాగ్దానాలు చేస్తున్నారే తప్ప కార్యరూపం దాల్చలేదని వాపోయారు. తుఫాన్ కారణంగా రైతులు భారీగా నష్టపోయారని నారుమళ్ళు దెబ్బతిన్న రైతులకు ఉచితంగా విత్తనాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సహాయక కార్యదర్శి నందిపోగు రమణయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.మాలకొండయ్య, సహాయ కార్యదర్శి ఆదినారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు లీలామోహన్, ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షులు జిలాని ఖాన్, ప్రజా నాట్య మండల జిల్లా కార్యదర్శి విజయ కుమార్, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పముజుల హరి, మండల సీపీఐ సీనియర్ నాయకులు చల్లా నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



**నెల్లూరు రూరల్, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని సౌత్ మోపూరు గ్రామంలో గురువారం రైతులకు యూరియా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొని రైతులను ఉద్దేశించి మాట్లాడారు. రైతుల పక్షపాత కూటమి ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా యూరియాను సమృద్ధిగా అందుబాటులో ఉంచిందని ఆయన తెలిపారు. కొంత మంది సృష్టిస్తున్న వదంతులను నమ్మవద్దని, ప్రతి పంట వేసిన అన్నదాతకు సరిపడా యూరియా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసమే ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయని గిరిధర్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రతి రైతుకు యూరియా అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షుడు బూడిద విజయ్ కుమార్, టీడీపీ సీనియర్ నాయకులు ఇందపూరు శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే కార్యాలయ మండల ఇన్‌చార్జి వేమిరెడ్డి సురేందర్‌రెడ్డి, జడ్పీ కో ఆప్షన్ మెంబర్ అలాబక్షు, మండల కో ఆప్షన్ మెంబర్ మీరా మొహిద్దీన్, గుండ్లపాలెం పీఏసీఎస్ సొసైటీ అధ్యక్షుడు పముజుల ప్రదీప్, ఏఎంసీ వైస్ చైర్మన్ రాపూరు శేఖర్, నీటి సంఘం అధ్యక్షుడు తుళ్లూరు రామయ్య, గ్రామ ఉప సర్పంచ్ చల్లా నరసయ్యతో పాటు అనేక మంది టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## సీపీఆర్‌పై అవగాహనతో సాటి మనిషిని కాపాడండి



**నెల్లూరు, అక్టోబర్ 30, ప్రభాతవార్త –వైద్యం :** సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉంటే, మన పక్కనే ఉన్న ఇతరులు ఎవరికైనా గుండె కొట్టుకోవడం స్తంభించినప్పుడు కాపాడవచ్చని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. గురువారం నెల్లూరులోని సంత పేటలో ఉన్న ప్రభుత్వ బీఈడీ కళాశాలలో విద్యార్థులకు, సిబ్బందికి సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ సీపీఆర్(కార్డియో పల్మోనరీ రిససిటేషన్) అనగా ప్రమాద స్థితిలో ఉన్న వ్యక్తి యొక్క గుండె కొట్టుకోవడం స్తంభించినప్పుడు లేదా శ్వాస తీసుకోలేని స్థితిలో ఉన్నప్పుడు రోగికి వెంటనే ఆచర్య పునరుద్ధరణకు చేయు అత్యవసర పక్రియను సీపీఆర్ అంటారని వివరించారు. సీపీఆర్‌పై అవగాహన కలిగిన వారు అలాంటి వ్యక్తులను ప్రాణాపాయ స్థితి నుంచి రక్షించవచ్చున్నారు. సీపీఆర్ ఎలా చేయాలో ప్రయోగాత్మకంగా చేసి చూపారు. అనంతరం డిజాస్టర్ కోఆర్డినేటర్ సుందర్ రాజా, కళాశాల విద్యార్ధులకు సిబ్బందికి సీపీఆర్‌పై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ ఫిజియోథెరపీ వైద్యులు పురంధర్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్ఎంఎన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం అన్ని దానాల కంటే గొప్పదానం



**కావలి, అక్టోబర్ 30, ప్రభాతవార్త:** రక్తదానం అన్ని దానాల కంటే గొప్పదనం అని కావలి డిఎస్పి పి.శ్రీధర్ తెలియజేశారు. పోలీసుల అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కావలి డీఎస్పీ కార్యాలయం వద్ద డిఎస్పి శ్రీధర్ ఆధ్వర్యంలో గురువారం రెడ్ క్రాస్, ఏరియా వైద్యశాల, వి ఫౌండేషన్ సహకారంతో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ రక్తదాన శిబిరం నందు కావలి రెండవ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ గిరిబాబు, పోలీసులు పలువురు పట్టణ ప్రజలు రక్తదానం చేయడం జరిగింది.ఈ సందర్భంగా డిఎస్పి శ్రీధర్ మాట్లాడారు జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు. ఈ రక్తదాన శిబిరంలో పోలీసులు,విద్యార్థులు, ఆటో డ్రైవర్లు, ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేయడం చాలా సంతోషంగా ఉందని తెలియజేశారు. రక్తదానం చేయడం వలన ఆరోగ్యకరంగా కూడా ఉంటారని తెలియజేశారు. రక్తదానం చేసి ప్రాణాలను కాపాడినందుకు రక్తదానం చేసిన వారికి అభినందనలు తెలియజేశారు. సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కావలి ఒకటవ పట్టణ, రెండవ పట్టణ సిఐలు ఫిరోజ్, గిరిబాబు ఎస్ఐలు సుమన్, ఆదిలక్ష్మి, రెడ్ క్రాస్ చైర్మన్ డి.రవి ప్రకాష్, ఏరియా వైద్యశాల వైద్యులు విజయ వాణి, వి ఫౌండేషన్ ఫౌండర్ వినయ్ కుమార్, లోక్సత్తా నాయకులు ఎం. మాలకొండ రెడ్డి మరియు కావలి సబ్ డివిజన్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అవినీతికి రక్షణగా ఉన్న అధికారులపై చీఫ్ సెక్రటరీకి ఫిర్యాదు



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** అవినీతి అక్రమాలను కాపాడుతూ వచ్చిన పూర్వపు ఎండి సిఈ జయరామాచారి ల పై చర్యలు తీసుకోవాలని చీఫ్ సెక్రటరీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్‌కు బిజెపి నేత మిడతల రమేష్ ఫిర్యాదు చేశారు అని రాష్ట్ర విజిలెన్స్ బృందం నెల్లూరులోని కొండ్లపూడి లేఅవుట్‌ను పరిశీలించి 1,58,442 డిఈ దయాకర్ అక్రమాన్ని గుర్తించిందని నివేదిక మేనేజింగ్ డైరెక్టర్ సమర్పించబడిందని కానీ, విజయవాడ హెడ్ ఆఫీస్‌లో సూపరింటెండింగ్ ఇంజనీర్ సి. జయరామచారి ప్రమేయంతో ఈ విషయం అణచివేయబడిందని అలాగే, అదే డిఈకి ఈఈగా పదోన్నతి ఇచ్చారని. ఆ వ్యక్తి తిరుపతి జిల్లాలోని చిందేపల్లి, కొట్టపల్లి లేఅవుట్‌లలో చేసిన భారీ అక్రమాలను విజిలెన్స్ బృందం పరిశీలించి, వందల పూర్తి కాలేని అసంపూర్ణ ఇండ్లకు జెఎన్ఆర్ కాంట్రాక్టర్‌కు తుది చెల్లింపులు చేసినట్లు తేలింది. కానీ, అప్పటి మేనేజింగ్ డైరెక్టర్ శివ ప్రసాద్, సి. జయరామచారి లకు ఈ అవినీతి అక్రమాలలో పరోక్షంగా లబ్ధి చేకూరడంతో సస్పెన్షన్ ఫైల్‌లో ఈ అవినీతిని పొందుపరచలేదు అన్నారు. నెల్లూరు, తిరుపతిలో చోటుచేసుకున్న అవినీతి తీవ్రత దృష్ట్యా, పి.దయాకర్ పర్యవేక్షణలో (డిఈఈ, ఈఈగా) జరిగిన ఈ అక్రమాలపై తగిన చర్యలు తీసుకోవాలని రమేష్ తన వినతి పత్రంలో కోరారు. ఆయనను తిరిగి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కేడర్‌కు మార్చాలి, క్రిమినల్ కేసుల వంటి కఠిన చర్యలు తీసుకోవడం అత్యవసరంగా రమేష్ పేర్కొన్నారు.

## తుఫాన్ బాధితులను ఆదుకోండి



**బిట్రగుంట అక్టోబర్ 30 ప్రభాతవార్త:** బోగోలు మండలంలో తుఫాన్ వలన గ్రామాలలో వర్షపు నీరు నిలిచిపోయి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి పేర్కొన్నారు గురువారం మండల తాసిల్దార్ కార్యాల యం ముందు ధర్నా నిర్వహించి తాసిల్దార్ కార్యాల యం లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి మాట్లాడుతూ ఇటీవల కురిసిన మెంత తుఫాన్ వలన గ్రామాలలో ఎస్సీ ఎస్టీ కాలనీలలో వర్షపు నీరు చేరడం వలన అసౌకర్యంగా ఉందని తెలియజేశారు. ప్రభుత్వాలు నాయకులు నిర్లక్ష్యంగా పట్టీ పట్టనట్లు ఉన్నారని పేర్కొన్నారు కనీసం చంద్రబాబు నాయుడు ప్రభుత్వం తుఫాను బాధితులకు 3000 రూపాయల డబ్బులు సరుకులు ఇవ్వమన్నా ఇప్పటివరకు ఆ ఊసే లేదని తెలియజేశారు కోవూరు పల్లి పంచాయితీ అంబేద్కర్ నగర్లో ప్రసాద్ ఇంటి నుంచి రియల్ ఎస్టేట్ వారు చుట్టూ గోడ కట్టి నందువలన వర్షపు నీరు పోయే పరిస్థితి లేక గ్రామాలలో వర్షపు నీరు నిలిచిపోయిందని పేర్కొన్నారు నీరు ఇప్పటికి తొలగించలేదని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వర్షపు నీరు తొలగించి బాధితులకు సాయం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా యానాది సామాఖ్య అధ్యక్షురాలు బాపట్ల సత్యవతమ్మ ఎన్జీవో పొట్లూరు కీర్తి స్థానిక నాయకులు ఆత్మకూరు మోహన్ రావు ప్రసాద్ జడ్డా వాసు ఆత్మకూరి తేజ పాల్గొన్నారు

## తుఫాన్ బాధితులకు అండగా ప్రభుత్వం



**వరికుంటపాడు, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** మొంథా తుఫాన్ బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచి వెంటనే ఆదుకుందని టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్‌రావు, జడ్పీటీసీ రావెళ్ల నాగేంద్రలు అన్నారు. తుఫాన్ ప్రభావంతో వరికుంటపాడు పునరా వాస కేంద్రంలో ఉన్న 25 కుటుంబాలకు నిత్యవసర సరుకులను అందజేశారు. ఈ టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్ రావు మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం రాష్ట్రంలో తీవ్ర నష్టాన్ని చేకూర్చకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుందన్నారు. మండ లంలో అధికారులు జాగ్రత్త వహించడం వలన ఎలాంటి నష్టం చేకూరలేదని వారి పనితీరును అభినంది ంచారు. వరికుంటపాడు పునరావాస కేంద్రంలో ఉన్న వారికి 25 కేజీల బియ్యం, ఒక కేజీ చక్కెర, ఒక కేజీ కందిపప్పు సరుకులను అందజేసి ప్రజల జీవనాస్థితికి అండగా నిలిచారన్నారు. తహసీల్దార్ పసుపులేటి హేమంత్ కుమార్ ముందస్తు చర్యలు తీసుకోవడం వలన మండలంలో ఎలాంటి ప్రమాదం లేవని ఆయనను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమణారెడ్డి, సొసైటీ అధ్యక్షులు గుర్రం గోపి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పోలుబోయిన శ్రీకాంత్ యాదవ్, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆంధ్ర నాగిరెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి నాదెండ్ల రాజా, గ్రామ పార్టీ అధ్యక్షులు పొద మాధవరావు, నాయకులు తెల్లగొర్ల వెంకటయ్య, ఆవుల అరుణమ్మ, కొత్తూలూరి మహదేవ, గుర్రం కొండలరావు, గడ్డం పెద్ద వెంగయ్య, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ



**వరికుంటపాడు, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు మెడికల్ కళాశాలలను ప్రైవేట పరం చేయడం తగదు అంటూ కోటి సంతకాల సేకర ణ కార్యక్రమాన్ని మండలంలోని రొంపిదొడ్ల గ్రా మం లో వైసీపీ మండల కన్వీనర్ మందలపు తిరు పతి నాయుడు ఆధ్వర్యంలో గురువారం చేపట్టారు. గ్రామం లోని ప్రజలకు మెడికల్ కళాశా లలను ఇప్పటి ప్రభు త్వం ప్రైవేటు పరం చేసేందుకు చూడడంపై వివరిం చారు. ఈ సందర్భంగా మందలపు తిరుపతినాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలతో విద్యార్ధుల జీవితాలతో ఆడుకుంటుందని ఎద్దేవ చేశారు. వైద్యం విద్య కోసం విద్యార్థులు ఎన్నో అవస్థలు పడుతుంటే అప్పటి వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలను ఏర్పాటు అందులో కొన్నింటిని ప్రైవేటుపరం చేయడం చాలా దారుణం అన్నారు. ప్రభుత్వంమన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రొంపి దొడ్ల గ్రామ నాయకురాలు కొండమ్మ,జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాగంటి శ్రీనివాసులు, ఉదయగిరి నియోజకవర్గం బూత్ కన్వీనర్ యర్రగుటి చెంచురెడ్డి,రాయవరపు మధు,చెన్నా రాయుడు, చిందే నవీన్, పెండ్యాల తిరుపతయ్య, ఉండేల సుబ్బారెడ్డి, సిసింద్రి,శివారెడ్డి, చిందే భాస్కర్,అంబటిరాజేష్,నారాయణరాజు,యర్రగూటి మాలకొండయ్య, చేవూరు ఎబినేజరు,చెన్నంపల్లి సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, మాధవ,జి.కొండయ్య,బి.అభిరామ్,ఎన్.జాషువా,పత్తి వెంకటరత్నం,చల్లకొలుసు సుధా,చల్లకొలుసు మాల్యాద్రి,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గోళ్ల రమేష్ కుటుంబాన్ని పరామర్శించిన బొల్లినేని, మేకపాటి



**వింజమూరు, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** కర్నూలు వద్ద ఇటీవల జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో ఉదయగిరి నియోజకవర్గం వింజమూరు మండలం గోళ్లవారిపాలెం గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందిన సంఘటనపై మాజీ ఎమ్మెల్యేలైన బొల్లినేని వెంకట రామారావు, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గురువారం గోళ్లవారిపల్లె గ్రామానికి చేరుకున్న బొల్లినేని వెంకట రామారావు, మేకపాటి చంద్రశేఖ ర్‌రెడ్డి ప్రమాదంలో మృతి చెందిన గోళ్ల రమేష్, ఆయన తండ్రి గోళ్ల మాలకొండయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పి, కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా బొల్లినేని వెంకట రామారావు మాట్లాడుతూ ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత దురదృష్టకరం. కష్టార్జితంతో ఎదిగిన రమేష్ కుటుంబం ఇలాంటి విషాధాన్ని ఎదు ర్కోవడం హృదయ విదారకం అని అన్నారు. రమేష్ భార్య అనూష, పిల్లలు శశాంత్, మన్విత్‌ను కోల్పోవ డం వంటి విషాధం మరెవరి జీవితంలోకి రాకూడదని ఆకాంక్షించారు.బాధలో ఉన్న మాలకొ ండయ్య కుమార్తె ధనమ్మ పరిస్థితిని ప్రస్తావిస్తూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి బొల్లినేని వెంకట రామారావు లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.

## సీతారామపురంలో కోటి సంతకాల సేకరణ



**సీతారామపురం అక్టోబర్ 30 ప్రభాతవార్త :** ప్రభుత్వ మెడికల్ కాలేజిలను ప్రవేటు పరం చేసేందుకు కూటమి ప్రభుత్వం తీసుకొని వచ్చిన పిపిపి విధానం వల్ల పేద ప్రజలకు విద్యార్థులకు విద్యా,వైద్యం దూరమౌ తాయని సీతారామపురం మండల వైసిపి కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి విమర్శి ంచారు. గురువారం సీతారామపురం బస్టాం డ్ సెంటర్‌లో మండల మాజీ ఉపాధ్యాక్షులు రామిశెట్టి తిరపతయ్య నెల్లూరు జిల్లా వైఎస్ఆర్‌సిపి యూత్ వింగ్ జాయింట్ సెక్రటరీ పాలగిరి ముద్దు కృష్ణమ రాజుల ఆధ్వర్యంలో నిర్వహించిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ప్రభుత్వ ఆస్తులను కూటమి ప్రభుత్వం ప్రవేటు వ్యక్తులకు అప్పజెబుతు రాష్ట్రాన్ని ఆర్థికంగా బలహీన పరచే దోరణిలో కూటమి ప్రభుత్వం నడుస్తుందని అన్నారు. పిపిపి విధానం వల్ల కూటమి పెద్దల జేబులు నిండుతాయి గాని పేద ప్రజలకు వైద్య విద్య దూరం అవుతు ఖర్చులేని నాణ్యమైన వైద్యాన్ని పొందడానికి పేదప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని అన్నారు. రాష్ట్ర మంతా ప్రజలందరు మెడికల్ కాలేజిల ప్రవేటి కరణాలను తీవ్రంగా వ్యతిరేఖిస్తున్నారని వైసిపికి బాసటగా నిలిచారని అన్నారు. అనంతరం ఇటీవల మరణించిన నారాయణమ్మ పేట గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు రమణయ్య కుటుంబాన్ని అదే విధంగా ఇటీవల గుండె నొప్పితో మృతి చెందిన వస్త్ర వ్యాపారి సురేంద్ర కుటుంబాన్ని పరామర్శించారు. ఈకార్యక్రమంలో వైసిపి మండల ప్రధానకార్యదర్శి బాలినేని మాబయ్య,వైసిపి నాయకులు గుండ్లపల్లి తిరిపాలు,చింతంరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, కనమర్లపూడి పవన్, ఎస్ నారాయణరాజు , షేక్ జమీర్ తదితరులు పాల్గోన్నారు.

## అన్ని ప్రాంతాల్లో మౌలికవసతుల కల్పనకు

– ప్రణాళికలను సిద్ధం చేయాలని కమిషనర్ ఆదేశం.



**నెల్లూరు కార్పొరేషన్, అక్టోబర్ 30,ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 9వ డివిజన్ అంబేద్కర్ నగర్ ప్రాంతంలో గురు వారం పర్యటించారు. స్థానికంగా తాగునీటి సరఫ రా, రోడ్లు, విద్యుత్ దీపాలు, పారిశుధ్య నిర్వ హణ తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజలు కమిషనర్ ను విజ్ఞప్తి చేశారు. అంబేద్కర్ నగర్ ప్రాంతంలో అన్ని మౌలిక వసతులను కల్పించేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కువ్వారపు బాలాజీ,నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్, రెవెన్యూ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన వదువును ఆశీర్వదించిన కాకర్ల.



**కలిగిరి, అక్టోబర్30, ప్రభాతవార్త;** కలిగిరి మండలం కొత్తూరుకు చెందిన కేతినేని వివాహ వేడుకలకు ఉద యగిరి శాసన సభ్యులుకాకర్ల సురేష్ హాజరై పెండ్లి కుమార్తెను ఆశ్వీదించారు. గురువారం ఎంఎల్ఏ కాకర్ల సురేష్ కొత్తూరుకు చెందిన కేతినేని సాంబశివరావు కుమార్తె తేజస్వినీ గందపు నలుగు కార్యక్రమానికి హాజరైనారు. ఈసందర్భంగా నవ వదువును ఆశీర్వదించి కుటుంబసభ్యులతో ముచ్చటించారు.ఈ కార్యక్ర మంలో బిజ్జం క్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నలంద పాఠశాల నందు హాలోవీన్ డే సెలబ్రేషన్స్



**కావలి, అక్టోబర్ 30, ప్రభాతవార్త:** కావలి పట్టణంలోని నలంద కిడ్జీ పాఠశాల నందు ఆదివారం హాలోవీన్ డే సెలబ్రేషన్స్ ఉత్సాహభరితంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు భిన్నమైన వేషధారణలతో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. వివిధ రకాల మాస్కులు, కాస్ట్యూమ్స్ ధరించి, మంత్రాల ధ్వని మధ్యలో గేమ్స్ లో పాల్గొని క్షణక్షణాన్ని ఆనందించారు.ఈ వేడుకలో ప్రధానోపాధ్యాయురాలు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు ఇలాంటి వేడుకలు పిల్లల సృజనాత్మకతను పెంపొందించడానికి సహాయ పడతాయి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొని హాలోవీన్ డే సంబరాలను ఆనందంగా జరుపుకున్నారు.

## కార్తీకమాసం సందర్భంగా ఆదివారం ప్రత్యేక బస్సులు ఏర్పాటు



**కావలి, అక్టోబర్ 30, ప్రభాతవార్త:** కార్తీకమాసం సందర్భంగా నవంబర్ 2 వ తేదీ ఆదివారం ప్రముఖ శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎపియస్ ఆర్టీసీ కావలి డిపో మేనేజర్ డి. ఆదినారాయణ గురువారం తెలియజేశారు.ప్రముఖ శైవ క్షేత్రాలైన శ్రీశైలం, అరుణాచలం, పంచారామాలకు స్పెషల్ సర్వీసులు నడుపుతున్నామని తెలియజేశారు. శ్రీశైలంకు అల్ట్రా డీలక్స్ బస్సు ఉదయం 10.30 గంటలకు కావలిలో బయలుదేరుతుందని, ఈ బస్సుకు టికెట్ ఛార్జ్ 535 రూపాయలు ( ఒక వైపు ) మాత్రమే అని, అరుణాచలంకు సూపర్ లగ్జరీ బస్సు ఉదయం 8.00 గంటలకు బయలుదేరుతుందని, ఛార్జ్ 1400 రూపాయలు ( పోను ,రాను ) అని, పంచారామం క్షేత్రాలైన అమరారామం, సోమరామం, క్షీరారామం, ద్రాక్షారామం, కుమారారామంలకు సూపర్ లగ్జరీ బస్సు రాత్రి 10.00 గంటలకు బయలుదేరుతుందని, ఛార్జి 2300 రూపాయలు ( పోను, రాను ) అని ఆయన తెలిపారు. పై సర్వీసులకు రిజర్వేషన్ సౌకర్యం కూడా కల్పించామని, కావున భక్తులు, పట్టణ పరిసర ప్రాంత ప్రజలు ఈ బస్సు సౌకర్యాలను ఉపయోగించుకుని, తమకు ఇష్టమైన శైవ క్షేత్రాలకు సురక్షితంగా, సౌకర్యావంతంగా దర్శించుకుని రావాలని కోరారు. ఇతర వివరాలకు 7382925413 ( విచారణ ), 9493913989 ( బస్టేషన్ మేనేజర్ ) సంప్రదించాలని ఆయన వివరించారు.

## గిరిజన కాలనీ తాగునీటి ట్యాంక్‌లో సూపర్ క్లోరినేషన్



**రాపూరు,అక్టోబరు30ప్రభాతవార్త :** మండల కేంద్రమైన రాపూరు పంచాయితీ పరిధిలోని నవాబుపేట గిరిజన కాలనీలోని తాగునీటి వాటర్ ట్యాంక్‌కు గురువారం గ్రామీణ త్రాగునీటి విభాగం ఇంజనీరింగ్ అధికారులు సూపర్ క్లోరినేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో వున్న నీటి ట్యాంకును శుభ్రపరిచి ట్యాంకును క్లోరినేషన్ చేశారు. ఈ కార్యక్రమంలో యంపీడీఓ భవాని, త్రాగునీటి విభాగం డిఇఇ నాగరాజు, ఎఇ అం జనేయులు, మండల కార్యలయం పర్యవేక్షకుడు దశరధరామి రెడ్డి, మద్దెలమడుగు సచివాలయం ఇంజ నీరింగ్ అసిస్టెంట్ తదితరులున్నారు.ఆర్.డబ్యూ.ఎస్ఇ డిఇఇ టి.నాగరాజు,

## రామదేవి పల్లి ఎమ్మార్పిఎస్ గ్రామ కమిటీ ఎన్నిక



**రాపూరు,అక్టోబరు30ప్రభాతవార్త :** మండలంలోని వేపినాపి పంచాయితీ పరిధిలోని రామదేవి పల్లి గ్రామ ఎమ్మార్పిఎస్ కమిటీని నియమించినట్లు ఎమ్మార్పిఎస్ జిల్లా అధికార ప్రతినిధి గోవిందు రంగయ్య తెలిపారు. గురువారం రామదేవిపల్లి అరుంధతీయ వాడలో గ్రామ అధ్యక్షుడు మేక అంకయ్య, ప్రధాన కార్యదర్శి కరిపం ఈశ్వరయ్య, కోశాధికారి మంద రమణయ్య,తూమాటి వెంకటరమణయ్యలతో గ్రామ కమిటీని ప్రకటించారు. రాపూరు మండలంలోని చుట్టుపాళెం, రావిగుంటపల్లి, బోజ్జనపల్లి, గ్రామాలలో కమిటీలను ఏర్పాటు చేసినట్లు రంగయ్య తెలిపారు. అన్ని గ్రామాలలో మాదిగ పెద్దలు అందరూ నవంబర్ 4వ తేది రాపూరు కచేరి ప్రాంగణంలో జరిగే మాదిగల రాజకీయ అవగాహనా సదస్సుకు హాజరై సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## బాధితులకు నిత్యవసర సరుకులు పంపిణీ



**విడవలూరు,అక్టోబర్ 30 ప్రభాతవార్త:** తుఫాన్ ప్రభావిత గ్రామాల పునరావాసంలో తలదా చుకున్న బాధితులకు 25 కిలోల బియ్యం , నిత్య వసర సరుకులు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం పార్లపల్లి సొసైటీలో తహశీల్దార్ కె. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3వేలు నగదు బాధితుల అకౌంట్లో జమ అవ్వడం జరుగుతుంది. అలాగే పునరావాసం బాధితులకు డీలర్ నమూనా రికార్డులలో సంతకం( లేదా)వేలిముద్ర ద్వారా జాగ్రత్తగా సరుకులు పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్ పర్సన్ ఏగూరు చంద్రరెడ్డి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ అబ్దుల్ సలాం,గ్రామ సర్పంచ్ భర్త రామిశెట్టి వెంకటేశ్వర్లు, వీఆర్వో నిఖిల్, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, డీలర్ రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచాలి



**కోవూరు, అక్టోబరు 30 ప్రభాతవార్త :** భారీ వర్షాలు తుపాను సోకిన ప్రాంతాల్లో ప్రస్తుతం ప్రజలకు సీజన్‌లో వచ్చే వ్యాధులపై మరింత అవగాహన కల్పించేలా వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా టీబీ, ఎయిడ్స్ నివారణాధికారి డాక్టర్ ఎస్‌కే ఖాదర్‌వలీ అన్నారు. కోవూరు మండలం ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోనూ, కోవూరు బిట్-1, బిట్-2లలో గురువారం ఆయన ఆకస్మిక పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పక్షం రోజులుగా కురిసిన ఆకస్మిక వర్షాల వలన దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని నీటిని కాచి చల్లార్చుని తాగాలన్నారు. అదేవిధంగా ఇంటి పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి ఫీవర్ సర్వే చేసి ప్రజలు జ్వరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండేలా వారిలో అవగాహన పెంచాలన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ప్రజలకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఇర్ఫాన్, విజయ్, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.



## జిల్లా ఖజానా కార్యాలయ నుతన డీటీ అండ్ ఎఒగా బి. శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరణ



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా ఖజానా కార్యాలయంలో నూతనంగా డీటీ అండ్ ఏఒగా బి. శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థలో ఖజానా విభాగం కీలకమైన పాత్ర పోషిస్తున్నది. ఖజానా సిబ్బంది అందరి సమన్వయంతో, ప్రజా నిధుల పారదర్శక వినియోగం, సమయపాలన, బాధ్యతాయుత ఆర్థిక నిర్వహణలో శ్రీనివాసులు మరింత నూతన దిశలో ముందుకు తీసుకువెళతారని విశ్వసిస్తు. ఆయనకు ఉన్న అనుభవం, నిబద్ధత, ప్రజాసేవా తపన ఖజానా విభాగానికి మరింత బలం చేకూరుస్తుందని ఖజానా సిబ్బంది తరఫున ఆయనకు ఈ కొత్త బాధ్యతలలో విజయం, ఆరోగ్యం, ఆనందం కలగాలని కోరుకుంటూ జిల్లా ఖజానా వ్యవహారాలు మరింత చక్కగా సాగేలా ఆయన నాయకత్వం మార్గదర్శకంగా నిలుస్తుందని సిబ్బంది తెలిపారు.

## కోరం లేక జెడ్పీ సర్వసభ్య సమావేశం తాత్కాలిక వాయిదా



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షత నగురువారం జరగాల్సి న సాధారణ సర్వసభ్య సమావేశం కోరం లేని కారణ ంగా వాయిదా పడింది. అయితే మొంథా తుఫాన్ నేపథ్యం, ఆగ్రోస్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు ఉత్తరక్రియలు ఉండడంతో సభ్యులు సమావేశానికి హాజరుకాలేదు. ఉదయం 10:30 గంటలకు జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమావేశానికి విచ్చేశారు. అప్పటికి ఇద్దరు జడ్పీటీసీ సభ్యులు మాత్రమే హాజరయ్యారు. సమావేశం నిర్వహణకు కోరం సరిపోకపోవడంతో గంట పాటు చైర్ పర్సన్ వాయిదా వేశారు. ఆ తర్వాత ఆరు మంది మాత్రమే హాజరయ్యారు. అప్పటికీ సరిపడా కోరం లేకపోవడంతో నిబంధనల ప్రకారం సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఆనం అరుణమ్మ ప్రకటించారు. తదుపరి సమావేశం ఎప్పుడు నిర్వహించాలన్నది సభ్యులు, అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆమె తెలిపారు.

## మాలేపాటి కుటుంబానికి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రగాఢ సానుభూతి



**దగదర్తి, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** దగదర్తి మండల కేంద్రంలో కి.శే ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు, దగదర్తి మండల యువ నాయకులు కి.శే మాలేపాటి భానుచందర్ దశదిన కర్మ కార్యక్రమంలో ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ హాజరై సుబ్బానాయుడు, భానుచందర్ చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి హృదయపూర్వకంగా ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ సమాజ సేవకు అంకితభావంతో జీవితాన్ని గడిపిన మాలేపాటి సుబ్బానాయుడు ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలుస్తారని అన్నారు. ఆయన చేసిన సేవలు, రైతుల అభివృద్ధికి చూపిన కృషి మరువలేనివని పేర్కొన్నారు. అలాగే, యువ నాయకుడు మాలేపాటి భానుచందర్ ప్రజలతో ఎప్పుడూ కలిసిమెలిసి , యువతలో స్ఫూర్తి నింపే నాయకుడిగా నిలిచారని గుర్తు చేశారు. కాకర్ల సురేషన వారి పవిత్ర ఆత్మలకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో భగవంతుడు వారికి ధైర్యం, ఓర్పు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, స్నేహితులు, బంధువులు, గ్రామ పెద్దలు, అభిమానులు, రాజకీయ నాయకులు పెద్ద ఎత్తున హాజరై కీర్తిశేషులకు నివాళులర్పించారు.

## మాలేపాటికి నరకం చూపించి చంపి పరామర్శకు వస్తావా.. గో బ్యాక్ ఎమ్మెల్యే కావ్య..



**దగదర్తి, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా దగదర్తిలోని దివంగత టీడీపీ నేత మాలేపాటి నివాసం వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. మాలేపాటి సుబ్బానాయుడు కర్మ క్రతువులకు వెళ్లిన కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిని, మాలేపాటి అభిమానులు అడ్డుకున్నారు. కావ్య కృష్ణారెడ్డి గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఉన్నట్టుండి ఇలా నినాదం చెలరేగడంతో అగ్రనేతలు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికి మాలేపాటి అభిమానులు వెనక్కి తగ్గకపోవడంతో చేసేది ఏమి లేక మాలేపాటి సుబ్బానాయుడికి నివాళులర్పించకుండానే ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కారు దిగకుండానే వెనుదిరిగి వెళ్లిపోయారు.

## ముందస్తు జాగ్రత్తలతో రొమ్ము క్యాన్సర్‌ను నివారించవచ్చు



**నెల్లూరు, అక్టోబర్ 30, ప్రభాతవార్త -వైద్యం :** ప్రతి స్త్రీ తమ వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణ కోసం ప్రతి రోజు ఒక్క క్షణం సమయం కేటాయిస్తే ఎన్నో ప్రమాదకరమైన వ్యాధుల నుండి బయటపడి ఆనందకరమైన జీవితాన్ని గడిపే అవకాశం ఉందని నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ సర్జికల్ అంకాలజిస్టు డాక్టర్ జీవీవీ ప్రసాద్‌రెడ్డి, అంకాలజిస్టు డాక్టర్ హరిత, డాక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్ సూచించారు. ప్రధానంగా రొమ్ము క్యాన్సర్‌ను ముందస్తుగా సులభంగా గుర్తించవచ్చునన్నారు. రొమ్ము క్యాన్సర్ అవగాహన మాస కార్యక్రమంలో భాగంగా నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్‌లో మహిళలకు ప్రత్యేకంగా రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ మెడికల్ సర్వీసెస్ డైరక్టర్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, సర్జికల్ అంకాలజిస్టు డాక్టర్ జవీవీ ప్రసాద్, అంకాలజిస్టు డాక్టర్ హరిత, యూనిట్ హెడ్ బాలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జవీవీ ప్రసాద్‌రెడ్డి, డాక్టర్ హరిత, డాక్టర్ శ్రీరామ్ సతీష్ మాట్లాడుతూ ఈ అక్టోబర్‌నెలను రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసంగా జరుపుకుంటున్నామని అన్నారు. అందులో భాగంగా అనేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించామని చెప్పారు. ప్రధానంగా నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్‌లో చెక్ 6 లేట్(చాక్లెట్) పేరుతో అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రతి స్త్రీ తన వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణ కోసం ప్రతి రోజు ఒక్క క్షణం సమయం కేటాయిస్తే వారి జీవితం చాక్లెట్ కంటే తీయగా ఉంటుందన్న అర్థంతో చెక్ ఓలేట్ కార్యక్రమాన్ని రూపొందించినట్లు వెల్లడించారు. అంతర్జాతీయ గణాంకాల ప్రకారం భారతీయ మహిళల్లో క్యాన్సర్ సంభవం, మరణాలకు రొమ్ము క్యాన్సర్ ప్రధానంగా ఉందని, ప్రతి ఏడాది క్యాన్సర్ కేసులు పెరుగుతున్నా, స్క్రీనింగ్ టెస్టుల నిర్వహణ విషయంలో భారతదేశం వెనుకబడి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే అపోలో హాస్పిటల్స్ సంస్థ క్యాన్సర్ నివారణ చర్యల్లో భాగంగా మహిళలకు అనేక అవగాహన కార్యక్రమాలు చేపడుతుందని వెల్లడించారు. మహిళలు చిన్న చిన్న స్వీయ పరీక్షల ద్వారా రొమ్ము క్యాన్సర్ లక్షణాలను ముందే గుర్తించవచ్చని వెంటనే వైద్యులను సంప్రదిస్తే దాన్ని త్వరగా నివారించే అవకాశం ఉందన్నారు. 40 ఏళ్లు పై బడ్డ ప్రతి మహిళా నెలకోసారి రొమ్ములకు చిన్న చిన్న స్వీయ పరీక్షలు చేసుకోవాలని, అనుమానం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. స్వీయ పరీక్ష చేసుకోలేని వారు కనీసం ఏడాదికి ఓ సారి రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించుకోవాలని డాక్టర్ జీవీవీ ప్రసాద్ రెడ్డి, డాక్టర్ హరిత, డాక్టర్ శ్రీరామ్ సతీష్ మహిళలను కోరారు. నెల్లూరు అపోలో హాస్పిటల్‌లో రొమ్ము క్యాన్సర్‌కు తక్కువ ఫీజులతోనే స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, అత్యాధునిక వైద్య పరికరాలు, అనుభవజ్ఞులైన వైద్యులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## అంగరంగ వైభవంగా అల్బాన్ హాస్పిటల్ నూతన ప్రారంభం



**కావలి, అక్టోబర్ 30, ప్రభాతవార్త:** కావలి క్రిస్టియన్ పేట నాలుగవ లైన్‌లో ఇంటెన్సీ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ అల్లం శ్రీనివాసులు, కాన్పులు గర్భకోశ వ్యాధి నిపుణులు, సంతాన సాఫల్య వైద్య నిపుణులు లేపరో స్కోపిక్ సర్జన్ డాక్టర్ పిట్టి పద్మ ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అల్బాన్ హాస్పిటల్ ను గురువారం ముఖ్య అతిథులుగా విచ్చేసిన కావలి శాసన సభ్యులు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు లు అంగరంగ వైభవంగా ప్రారంభించడం జరిగింది. వీరిని మేళతాళాలతో పూల జల్లులతో ఘన స్వాగతం పలికి పూల బొకేలను అందజేసి దృశ్యాలవాలతో ఘనంగా సత్కరించడం జరిగింది. అనంతరం పూజా కార్యక్రమాల్లో పాల్గొనడం జరిగింది. హాస్పటల్ను పరిశీలించి అన్ని సౌకర్యాలు కల్పించిన డాక్టర్ అల్లం శ్రీనివాసు లను, డాక్టర్ పిట్టి పద్మలను అభినందించి వారి కుమార్తెలు కూడా డాక్టర్లు అవ్వాలని ఆశీర్వది ంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు పట్టణ ప్రముఖులు, డాక్టర్లు, పలు రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు.



## జిల్లా కలెక్టర్‌ను అభినందించిన సిల్వర్ ఓక్స్ చిన్నారులు




**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబర్ 30, ప్రభాతవార్త ;** గురువారం స్థానిక పార్థసారథి నగర్ లోని సద్గురు సిల్వర్ ఓక్స్ స్కూల్ పిల్లలు కలెక్టరు హిమాన్షు శుక్లని కలెక్టర్ కార్యాలయంలో కలిసి ఇటీవల వచ్చిన ముందా తుపాన్ గురించి ముందుస్తుగా పటిష్ట మైన చర్యలను తీసుకుని, ప్రజలను అప్రమత్తంగా ఉంచి, ప్రజా జీవనానికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా సమర్థవంతంగా ఎదుర్కొన్నందుకు కలెక్టర్‌ని పుష్పగుచ్ఛాలు, మెమెంటోలతో అభినందించారు. ఈ సందర్భంగా తుపాన్ అప్రమత్తత గురించి ఈ చిన్నారులు సోషల్ మీడియాలో షేర్ చేసిన వీడియోలు చూసిన కలెక్టర్ చిన్నారులకు తమ ఆశీస్సులును తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్లు వెంకటాద్రి నాయుడు, షణ్ముఖాచారి, ప్రిన్సిపాల్ సుధాకర్ రావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** నెల్లూరు సిపిఎం నెల్లూరు రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట గురు వారం ధర్నా నిర్వహించారు. నెల్లూరు రూరల్ మండలంలోని అన్ని గ్రామాల్లో ఇటీవల కురిసిన తుఫాన్ కారణంగా గ్రామాల్లోని ప్రజలకు పనులు కోల్పోయి ఉన్నారని ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సంబంధించిన ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు ప్రస్తుతం పొట్టే పాలెం కందమూరు గ్రామాలలో పునరావాస కేంద్రాల్లో కొంతమంది నివసించుచున్నారని గత కొన్ని రోజులుగా కురిసిన భారీ వర్షాలు కారణంగా పనులు కోల్పోయి మరో 20 రోజులు కూడా పనులు లేని పరిస్థితి ఉంది కాబట్టి నెల్లూరు మండలంలో పనులు కోల్పోయిన పేదవారికి 25 కేజీల బియ్యం నిత్యవసర వస్తువులు, ఆర్థిక సహాయం చేయాలని నెల్లూరు రూరల్ మండల కమిటీ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం డిఆర్‌ఓకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మాదాల వెంకటేశ్వర్లు, అల్లూరు తిరుపాలు, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

## సుబ్బానాయుడు, భానుచందర్‌కు సోమిరెడ్డి ఘన నివాళి



**దగదర్తి, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** దగదర్తిలో సుబ్బానాయుడు, భానుచందర్ ఉత్తరక్రియలకు జిల్లా నాయకులతో కలిసి నివాళులర్పించిన సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొని నివాళులర్పించారు. మాలేపాటి కుటుంబంలో తీరని విషాదం నెలకొనడం బాధాకరం అన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి మాలేపాటి కుటుంబం అంకితభావంతో పని చేస్తోంది. సుబ్బానాయుడు తండ్రి రామానాయుడు జడ్పీటీసీ సభ్యునిగా, విప్‌గా ప్రజలకు సేవలందించారనానరు. దగదర్తి ఎంపీపీని గెలిపించుకోవడంలో కీలక పాత్ర పోషించారన్నారు. ఆ తర్వాత సుబ్బానాయుడు, రవీంద్రనాయుడు రాజకీయాల్లో చురుగ్గా ఉన్నారన్నారు. పెద్దాయన రామానాయుడితోనూ మాకు ఎంతో అనుబంధం ఉందన్నారు. వారి వారసుడిగా యువనేత భానుచందర్ కూడా తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడి పని చేస్తూ వచ్చారన్నారు. పేదలకు అండగా నిలవడంలో రవీంద్రనాయుడు ఎంతో ఉదారంగా వ్యవహారించేవారన్నారు. వారం వారం లక్షలాది రూపాయలు పేదలకు సాయం చేయడం, ఇంటి నిర్మాణాలకు అండగా నిలవడం గొప్ప విషయం అన్నారు. అంతా సంతోషంగా జరిగిపోతున్న తరుణంలో వారి ఇంట ఇలాంటి ఘటన జరుగుతుందని ఊహించలేదన్నారు. మణిపాల్ ఆసుపత్రిలో సుబ్బానాయుడు చికిత్స పొందుతున్నప్పుడు భానునే మమ్మల్ని రిసీవ్ చేసుకున్నారన్నారు. ఎంతో చురుగ్గా ఉండే సుబ్బానాయుడు సడెన్‌గా కోమాలోకి పోవడం మాకు షాకింగ్ అన్నారు. ఒకే రోజు ఉదయం భాను, సాయంత్రం సుబ్బానాయుడు అంత్యక్రియలకు హాజరు కావాల్సి న పరిస్థితి వస్తుందని ఊహించలేదు. అత్యంత దురదృష్టకర ఘటన ఇది. కావలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా ఆయన ఎంతో కష్టపడి పని చేశారు. ఆనాటి కావలి వైసీపీ ఎమ్మెల్యే అరాచకాలపై సుబ్బానాయుడు వీరోచిత పోరాటం చేశారన్నారు. పలు కార్యక్రమాల్లో నేను కూడా భాగస్వామినయ్యాను అన్నారు. 30 అడుగుల మేర గోతులు పెట్టి గ్రావెల్‌ను కొల్లగొడుతుంటే నన్ను తీసుకెళ్లి నిరసన కార్యక్రమం నిర్వహించారు. కావలిలో దళిత బిడ్డ కరుణాకర్ ఆత్మహత్య ఘటన చేసుకున్న సమయంలోనూ నన్ను తీసుకెళ్లారు. అక్కడి నుంచే జాతీయ ఎస్సీ కమిషన్‌కు నాతో ఫోన్ చేయించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవడంలో కీలక పాత్ర పోషించారు. కుదువలో ఉన్న కరుణాకర్ ఇంటికి సుబ్బానాయుడు, రవిచంద్ర సొంత నగదు చెల్లించి యువనేత నారా లోకేష్‌బాబు, సమయంలో బాధిత కుటుంబానికి ఇంటి పత్రాలు ఇప్పించారు. రాష్ట్రంలోని టాప్ 5 లో ఉండే ఏపీ ఆగ్రోస్ కార్పొరేషన్ చైర్మన్ బాధ్యతలను సుబ్బానాయుడికి చంద్రబాబునాయుడు, లోకేష్ బాబు అప్పగించారన్నారు. ఒక్క సారిగా అనారోగ్యానికి గురై మనమధ్య లేకుండా పోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నామన్నారు. ఈ కష్టకాలంలో రవీంద్రనాయుడితో పాటు సుబ్బానాయుడి కుటుంబ సభ్యులు మనో నిబ్బరంతో ధైర్యంగా నిలబడాలని ఆశిస్తున్నాం. మాలేపాటి కుటుంబానికి భగవంతుడు ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నాం సుబ్బానాయుడు, భానుచందర్ ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాం అని చెప్పారు. ఆయనతోపాటు ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, అబ్దుల్ అజీజ్, టీడీపీ పార్టీ నాయకులు ఉన్నారు.

## టిడ్కో కాలనీలో సమస్యలు అతి త్వరలో పరిష్కారం



**కావలి, అక్టోబర్ 30, ప్రభాతవార్త:** వర్షాలు కురిసినప్పుడల్లా మద్దూరుపాడు వద్దగల టిడ్కో కాలనీలో వరద నీరు చేరుతోందని, ఆ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలియజేశారు. మెంథా తుఫాను నేపథ్యంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు టిడ్కో కాలనీ ముంపుకు గురవటంతో అక్కడ ప్రజలు ఇబ్బందులు పడుతున్నందున గురువారం కావలి శాసనసభ్యులు దగ్గుబాటి వెంకట కృష్ణారెడ్డి తో కలిసి జిల్లా ఇన్చార్జి మంత్రి ఎండి.ఫరూక్, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి లు పరిశీలించి ప్రభుత్వం అందించిన నిత్యవసర వస్తువులను కాలనీవాసులకు నాయకుల చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే కృష్ణారెడ్డి మాట్లాడారు తుఫాను సమయంలో కాలనీ వాసుల కష్టాలను తాను స్వయంగా చూశానని తెలియజేశారు. వెంటనే ఆహారం, తాగునీరు అందించినట్లు గుర్తుచేశారు. కొద్ది గంటల్లోనే విద్యుత్ సరఫరా కూడా పునరుద్ధరిస్తామని తెలియజేశారు. కాలనీలోని ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సాయం తప్పక అందుతుందని హామీ ఇవ్వడం జరిగింది. చిన్న చిన్న లోపాలు తప్ప టిడ్కో అపార్ట్మెంట్లను నాణ్యతతో నిర్మించారని, నియోజకవర్గంలో ఎక్కడా లేనివిధంగా ఈ కాలనీలోనే అండర్ గ్రౌండ్ కరెంట్ లైన్స్, సీవేజ్ ప్లాంట్ కూడా ఏర్పాటు చేశారని తెలియజేశారు. ఎంతో ముందు చూపుతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టిడ్కో అపార్ట్మెంట్లకు శ్రీకారం చుట్టార న్నారు. ఈ కాలనీలో మరో 1600 కుటుంబాలు గృహప్రవేశాలు చేయాల్సి ఉందన్నారు. అయితే లోతట్టు ప్రాంతంలో కాలనీ నిర్మించడం వల్ల చెరువు నిండినప్పుడల్లా బ్యాక్ వాటర్ కాలనీలోకి వస్తోందన్నారు. ఆ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి ఇప్పటికే మున్సిపల్ శాఖ మంత్రికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని తెలియజేశారు. చెరువు బ్యాక్ వాటర్ కాలనీలోకి రాకుండా రిటైనింగ్ వాల్ నిర్మించాల్సి ఉందన్నారు. అటవీ భూములతోపాటు రైల్వే ట్రాక్ ప్రాంతాల నుంచి వరద నీరు కూడా కాలనీలోకే వస్తోందన్నారు. ఆ వరద నీటినిజాతీయ రహదారి వైపు మళ్లించేందుకు ప్రత్యేక కాలువ అవసరం ఉందన్నారు. అలాగే కాలనీలోకి వరద నీరు చేరినప్పుడు, ఆ నీటిని ఎత్తిపోసేందుకు కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సి ఉందన్నారు. ఈ మూడు పనులకు ప్రతిపాదన తయారు చేసి పంపామని, త్వరలోనే నిధులు మంజూరు అవుతాయని తెలియజేశారు. కాలనీవాసులకు ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని, చిన్న సమస్య వచ్చినా ఒక్క ఫోన్ కాల్ చేస్తే వెంటనే స్పందించి పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏం సి చైర్మన్ పోతుగంటి అలేఖ్య, కావలి ఆర్డిఓ సన్నీ వంశీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ జి. శ్రావణ్ కుమార్ తాసిల్దార్ శ్రావణ్ కుమార్, కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సెనిక్ స్కూళ్లలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ గడుపు పెంపు



**నెల్లూరు, అక్టోబరు30 ప్రభాతవార్తవిద్య :** 2026, 2027 విద్యాసంవత్సరంలో సైనికస్కూళ్లలో 6,9 తరగతుల్లో చేరగోరు విద్యార్థుల సౌకర్యార్థం ధరఖాస్తుల స్వీకరణ గడువును ప్రభుత్వం పెంచటం జరిగిందని గురుస్థాన్ కోచింగ్ సెంటర్ కరస్పాండెంట్ షేక్.మహమ్మద్ ఖాన్ పేర్కొన్నారు. గురువారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడారు. గతంలో సైనికస్కూళ్లలో చేరేందుకు ఇచ్చిన గడువు నేడిటో ముగిసిపోయిందని, అయితే విద్యార్థుల తల్లిదండ్రుల నుండి వచ్చిన వినతుల మేరకు ధరఖాస్తు స్వీకరణ గడువును నవంబరు 9వ తేదీ వరకు ప్రభుత్వం పెంచటం జరిగిందన్నారు. తప్పులు, సవరణలకు 12,14 తేదీల్లో అవకాశం కల్పించటం జరిగిందన్నారు. జనవరి 18న నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ ద్వారా ఎంపిక పరీక్షలు జరుగనున్నాయని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 9441720918, 9493689159 నెంబర్లకు కాల్ చేయ్యాలని ఆయన కోరారు.

## తుఫాను బాధితులకు నిత్యావరసాల పంపిణీ



**నెల్లూరు, అక్టోబరు30 ప్రభాతవార్త విద్య :** మొంథా తుఫాను ధాటికి నిరాశ్రయులైన నగరంలోని స్థానిక 53వ డివిజన్ వెంకటేశ్వరపురంలోని బాధితులకి వైకాపా పార్టీ నెల్లూరు అసెంబ్లీనియోజకవర్గఇన్‌చార్జ్, తూర్పురాయలసీయ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి నిత్యావస సరులకు కిట్స్, ఆహార ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతు నగరంలో తుఫాను బాధితులకు తాము ఎల్లప్పుడు అండగా ఉంటామన్నారు. నెల్లూరు నగరం పరిధిలో ముంపు పరివాహక ప్రాంతాల్లో బాధితులక ఆదుకునేందుకు , వరదల వల్ల ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం శాశ్వత చర్యలు తీసుకో వాలన్నారు. నేడు బాధితులను ఆదుకునేందుకు వైకాపా 53వ డివిజన్ ఇన్‌చార్జ్ వెంగల్‌రెడ్డి ఆధ్వర్యంలో బాధితులకు బియ్యంతోపాటూ 5 రకాల నిత్యవసర సరుకులతో కూడిన కిట్స్‌ను పంపిణీచేయటం అలాగేనిరాశ్రయులకు అహార ప్యాకెట్ల పంపిణీచేయటం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెర్నేటి కోట్వేశ్వరరెడ్డి, ప్రసన్నకుమార్‌రెడ్డి, శరత్, మస్తాన్, అస్లాం, సలాం తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధాప్య దశలో ఉన్న 12 మందికి తాత్కాలిక ప్రాతిపదికన గృహాలను కేటాయిస్తూ కమిషనర్ ఉత్తర్వులు



**నెల్లూరు కార్పొరేషన్, అక్టోబర్ 30, ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు ఏపీ టిడ్కో గృహాల కేటాయింపు జరిగినప్పటికీ నిర్మాణాలు పూర్తికాని సందర్భంగా కమిషనర్ వై.ఓ నందన్ ఆదేశాల మేరకు నిరుపేదలు, దివ్యాంగులు, వృద్ధాప్య దశలో ఉన్న 12 మందికి తాత్కాలిక ప్రాతిపదికన గృహాలను కేటాయిస్తూ కమిషనర్ గురువారం ఉత్తర్వులను జారీ చేశారు. ఈ మేరకు అర్హులైన లబ్ధిదారులకు కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్ లో 12 మందికి తాత్కాలిక నివాస ఉత్తర్వులను కమిషనర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ విభాగం సూపరింటెండెంట్ పద్మ, సిబ్బంది పాల్గొన్నారు.

## తుపాను ప్రభావిత బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుంది



**కోవూరు, అక్టోబరు 30 ప్రభాతవార్త :** కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో ఉన్న సివిల్ సప్లయిస్ గోదాములను గురువారం నెల్లూరు ఆర్డీవో నాగ సంతోష్ అనూష నిశిత పరిశీలన చేపట్టారు. ఈ గోదాముల్లో తుపాను ప్రభావిత ప్రాంత ప్రజలకు ప్రభుత్వం అందజేస్తున్న బియ్యం, చక్కెర, కందిపప్పు, ఎర్రగడ్డల నాణ్యతను ఆమె నిశితంగా పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తుపాను ప్రభావంతో ఇబ్బందులు పడ్డ ప్రజలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని ఈ నిత్యావసర సరుకులు అందించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కోవూరు మండలంలో రెవెన్యూ, మండల పరిషత్, ఆర్‌అండ్‌బీ, ట్రాన్స్‌కో , ఇరిగేషన్ , ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమిష్టిగా పనిచేసి కష్ట సమయాల్లో ప్రజలకు అండగా నిలిచారని ఇందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆమె గోదాము ఇన్‌చార్జి, సివిల్ సప్లయిస్ డీటీ బాలకోటమ్మ ద్వారా పలు విషయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బషీర్ ఉన్నారు.

## తుపాను పునరావాస కేంద్రంలో నిత్యావసర వస్తువులు పంపిణీ



**కోవూరు, అక్టోబరు30 ప్రభాతవార్త:** కోవూరు మండలం ఇనమడుగు, వేగూరులో ఉన్న తుపాను కేంద్రాల్లో ఉన్న ప్రజలకు గురువారం నెల్లూరు ఆర్డీవో నాగ సంతోష్ అనూష ప్రభుత్వం ద్వారా వచ్చిన బియ్యం, నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నాణ్యమైన వస్తువులనే పంపిణీ చేయడం జరిగిందని, డీలర్లు కూడా యుద్ధప్రాతిపదికన రేషన్ పంపిణీ చేసేలా దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బషీర్, మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు పెంచలయ్య, పురుషోత్తం, మాజీ ఎంపీటీసీ వేణు, తదితరులు ఉన్నారు.

## రైతులకు అందుబాటులో యూరియా- వ్యవసాయాధికారిణి



**సైదాపురం, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** సైదాపురం మండలంలో ఉన్న ప్రతి రైతు సేవ కేంద్రం పరిధిలో రైతులకు యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయ శాఖాధికారిణి హైమావతి తెలిపారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ మండలంలోని రైతులు యూరియా గురించి ఆందోళన చెందాల్సి న అవసరం లేదని స్థానిక రైతు సేవ కేంద్రంలో అందుబాటులో ఉందని తెలిపారు. అర్హులైన రైతులు తమ యొక్క ఈ పంట నమోదు, పొలంపాస్ బుక్ ఆధారంగా కార్డును రైతు సేవ కేంద్రంలోని గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా పొంది ఎకరానికి మూడు బస్తాలు, వరి సాగు చేయు రైతులకు మూడు దఫాలుగా పొందటానికి అవకాశం ఉంటుందని ఆమె తెలిపారు. అర్హులైన ప్రతి రైతుకు కార్డు ద్వారా గాని, సొసైటీలు, ఆర్‌ఎస్‌కే లేదా లైసెన్స్ డీలర్ ద్వారా యూరియా పొందే అవకాశం ఉందని ఆమె అన్నారు. రైతులు రైతు సేవ కేంద్రం వద్ద వ్యవసాయ సహాయకులను సంప్రదించి కార్డును పొందాలని ఆమె తెలిపారు. అనంతరం సైదాపురంలోని ఎరువుల దుకాణాలను ఆమె తనిఖీ చేశారు.

